# టైమ్స్ ఆఫ్ వార్త

తెలుగు దినపత్రిక

ఎడిటర్ : గూడూరు జనార్థన్ రెడ్డి

తెలంగాణ | శుక్రవారం, 03- మే - 2024 |సంపుటి : 16 |సంచిక : 293 |పేజీలు 08 | వెల : 6/-


## కేసీఆర్ గొంతు నొక్కారు.. కేసీఆర్‌కేనా నోటీసులు

# మోడీకి ఎందుకివ్వరు...?

## న్యాయవ్యవస్థపై మాకు నమ్మకముంది : కేటీఆర్

- రేవంత్‌రెడ్డి బూతులేమో ప్రవచనాలు, సుభాషితాలా?
- ఈసీ ఇలాగే ఉంటే సజావుగా, స్వేచ్ఛగా ఎన్నికలు కష్టమే
- అది ఎలక్షన్ కమిషన్ కాదు.. బీజేపీ కమిషన్
- బడా భారుకు, చోటా భారుకు ఓటుతో బుద్ధి చెప్పాలి : కేటీఆర్



టైమ్స్ ఆఫ్ వార్త - హైదరాబాద్ :

రైతులు, నేత కార్మికుల దీన స్థితి గురించి తెలుసుకుని ఆవేదనతో కొంత పరుషంగా మాట్లాడిన కేసీఆర్‌కు నోటీసులిచ్చిన ఎన్నికల కమిషన్ మత వైషమ్యాలు రెచ్చగొడుతూ, పదే పదే ఎన్నికల ప్రవర్తనా నియామవాళిని ఉల్లంఘిస్తున్న ప్రధాని మోడీకి నోటీసులెందకు ఇవ్వలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, సీనియర్ నేత రావుల చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డిపై ఎనిమిది ఫిర్యాదులతో కలుపుకుని కాంగ్రెస్‌పై మొత్తం 27 ఫిర్యాదులను బీఆర్ఎస్ చేసినా చర్యలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాని మోడీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కనుసన్నల్లో ఎన్నికల సంఘం పని చేస్తున్నదని ఆయన ఆరోపించారు. ఎలక్షన్ కమిషన్ కాస్తా బీజేపీ కమిషన్‌గా మారిపోయిన నేపథ్యంలో ఎన్నికలు స్వేచ్ఛగా, సజావుగా ఎలా జరుగుతాయని అనుమానం వ్యక్తం చేశారు. ఎలక్షన్ కమిషన్ నిజంగా స్వయం ప్రతిపత్తి గల సంస్థే అయితే, మత వైషమ్యాలు రెచ్చగొట్టేలా మాట్లాడుతున్న బీజేపీ నాయకులు, పదే పదే బూతు పురాణం ఎత్తుకుంటున్న సీఎం రేవంత్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరారు. తమకు న్యాయవ్యవస్థపై నమ్మకముందనీ, సత్యమే జయిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అరాచకంగా మాట్లాడిన బీజేపీ, కాంగ్రెస్ నాయకులను వదిలేసీ, రైతులు, నేతన్నల బాధలు చూసి ఆవేదనతో మాట్లాడిన కేసీఆర్ ప్రచారంపై 48 గంటల నిషేధం విధించడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. కాంగ్రెస్, బీజేపీలకు ఓటుతో బుద్ధి చెప్పాలని ఆయన ప్రజలను కోరారు. కేంద్రంలోని బీజేపీ సర్కారు అనుకున్నట్టు నియామకాలు జరపుకోవడంతో ఎన్నికల కమిషన్ కాస్తా బీజేపీ కమిషన్‌గా వ్యవహరిస్తున్నదని కేటీఆర్ ఈ సందర్భంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. పీఎంతో పాటు కేంద్ర హొంశాఖ మంత్రి, బీజేపీకి చెందిన పలువురు నేతలు, అభ్యర్థులు పదే పదే మతాన్ని ప్రచారానికి ఉపయోగించుకుంటున్నారని తెలిపారు. ఆ పార్టీ సోషల్ మీడియాలో ముస్లింలపై విషం చిమ్ముతున్నా ఒక్క చర్యా లేదని గుర్తుచేశారు. ఏప్రిల్ 10న తుక్కుగూడ సభతో పాటు అనేక సందర్భాల్లో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడిన మాటలు ఎలక్షన్ కమిషన్‌కు ప్రవచనాలు, సుభాషితాలు, నీతి సూక్తులుగా వినిపించాయా? అని ఎద్దేవా చేశారు. పండబెట్టి తొక్కుతం లాగులూడదీసి తొండలో దులుతం, కేసీఆర్ తల నరకండి, తల తెగ్గోయండి వంటి అనేక మాటలను రేవంత్ రెడ్డి మాట్లాడారంటూ స్క్రీన్‌పై ప్రదర్శించి చూపించారు. కేసీఆర్ బస్సు యాత్రకు వస్తున్న అనూహ్య ప్రజా స్పందన, పలు సర్వేల్లో బీఆర్ఎస్‌కు 10 నుంచి 12 ఎంపీ సీట్లు వస్తాయనే రిపోర్టులు, నిఘా సంస్థలు కూడా బీఆర్ఎస్‌కు వాతావరణం అనుకూలంగా ఉందని చెప్పడంతోనే కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు. బీజేపీ, కాంగ్రెస్ సోషల్ మీడియాల్లో వ్యక్తిగత హననం చేస్తున్నా, రాజ్యాంగాన్ని అపహాస్యం చేసేలా పోస్టులు పెడుతున్నా ఈసీకి పట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

### అది ఫేక్ సర్టిఫికెట్ సీఎం రేవంత్‌ను అరెస్టు చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీకి సంబంధించి గతేడాది బీఆర్ఎస్ విడుదల చేసిన సర్క్యులర్ అంటూ ఒక దాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ట్విట్టర్ హ్యాండిల్‌లో ప్రచారం చేశారని కేటీఆర్ తెలిపారు. అది ఫేక్‌దని విమర్శించారు. ఇలాంటి నకిలీ సర్క్యులర్ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డిపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఇదే విషయంపై ఇప్పటికే ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులు సంబంధిత పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. రేవంత్ రెడ్డి సీఎం హొదాలో ఉండి ఇలాంటి చిల్లర పనులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

### భయపడం..

ఓయూ సర్క్యులర్‌కు సంబంధించి ఫోర్జరీ కేసులో రేవంత్‌రెడ్డిని అరెస్టు చేయకపోగా, అది ఫోర్జరీదని చెప్పినందుకు బీఆర్ఎస్ సోషల్ మీడియా నాయకులు మన్నె క్రిశాంక్‌ను అరెస్టు చేశారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్‌కు ఉద్యమ కాలంలో 14 ఏండ్ల పాటు అక్రమ కేసులను ఎదుర్కొన్న చరిత్ర ఉందని ఆయన గుర్తుచేశారు. అందువల్ల కేసులకు భయపడేది లేదని స్పష్టం చేశారు. ఒక వైపు రాహుల్ గాంధీ నఫ్రత్ కీ బాజార్ మే

మిగతా 7లో..



# రేపిస్టు ప్రజ్వల్‌కు ప్రధాని మద్దతు..

**శివమొగ్గ :** మాజీ ప్రధాని దేవెగౌడ మనవ డు, హసన ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ పై రా హుల్ గాంధీ సంచలన ఆరోపణలు చేశా రు.దాదాపు 400 మంది మహిళలపై ప్ర జ్వల్ అఘాయిత్యానికి పాల్పడ్డాడని , వారి వీడియోలు చిత్రీకరించాడని అన్నారు . అ టువంటి వ్యక్తికి ఓట్లు వేయాలని కోరిన ప్రధాన మంత్రి నరేంద్రమోడీ దేశ మహిళలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చే శారు. శివమొగ్గలో జరిగిన ఎన్నికల ప్రచారసభలో పాల్గొన్న ఆయన ప్రజ్వల్‌ను మో స్ట్ రేపిస్ట్‌గా పేర్కొన్నారు. "ప్రజ్వల్ రేవణ్ణ 400 మంది మహిళలపై అఘాయిత్యానికి పాల్పడి , వారి వీడియోలు చిత్రీకరించాడు. ఇది సెక్స్ కుంభకోణం కాదు. ఇది అతిపెద్ద అత్యాచార సంఘటన. ఓట్ల గురించి వాళ్లు (బీజేపీ కూటమి) అడుగుతున్నప్పుడు ప్రజ్వల్ ఏం చేశాడో ప్రతీ మహిళ తెలుసుకోవాలి. అతడి గురించి ప్రధానికి ముందే తెలుసు. అటువంటి వ్యక్తికి కర్ణాటక వేదికగా మోడీ మద్దతు పలికారు" అని రాహుల్ గాంధీ ఆరోపించారు. ప్రజ్వల్ ఒక మాస్ రేపిస్ట్ అని బీజేపీకి చెందిన ప్రతీఒక్క నేతకు తెలుసునని రాహుల్ ఆరోపించారు. అయినప్పటికీ అతడికి మద్దతు పలకడమే కాకుండా అతడి పార్టీతో పొత్తు పెట్టుకున్నారని విమర్శించారు. అటువంటి వ్యక్తికి ప్రచారం చేసినందుకు గాను దేశంలో ప్రతీ మహిళకు ప్రధాని మోడీ , అమిత్‌షా సహా బీజేపీ నేతలు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మరోవైపు ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ, ఎమ్ఎల్ఎ రేవణ్ణపై లైంగిక దౌర్జన్యం అభియోగాలపై కేసు నమోదైంది. దీనిపై పూర్తిస్థాయి విచారణ చేపట్టేందుకు కర్ణాటక ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్ ) ఏర్పాటు చేసింది. కేసు విచారణకు హాజరు కావాలని వీరిద్దరికీ సిట్ ఇప్పటికే నోటీసులు జారీ చేసింది. వారం రోజుల సమయం కావాలని ప్రజ్వల్ చేసిన విజ్ఞప్తిని తోసిపుచ్చిన దర్యాప్తు బృందం , ఆయనపై తాజాగా లుక్‌అవుట్ నోటీస్ జారీ చేసింది.

## అంతు చిక్కని ప్రజానాడి ?



- త్రిశంకు స్వర్గంలో భువనగిరి పార్లమెంట్ ఎన్నికలు
- దగ్గర పడుతున్న పార్లమెంట్ ఎన్నికలు...
- చుక్క.. ముక్కా.. బుక్కా.. నోటు కోసం ఎదురుచూస్తున్న ఓటర్లు?
- అభ్యర్థులందరూ కోటీశ్వరులే కోట్లు కుమ్మరిస్తారన్న భరోసాలో క్యాడర్?
- కరువులో అరువు తెచ్చుకున్న కార్యకర్తలతో రోడ్ షోలు.. కార్నర్ మీటింగ్‌లు?
- గెలుపు భారం అధికార పార్టీ ఎమ్మెల్యేలదే అంటున్న అధికార పార్టీ అభ్యర్థి?

8లో..

# బీజేపీకి ఓటేస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తరు

- కేసీఆర్ జైలుకు పంపిస్తేనే భయపడనోన్ని.. మోడీ కేసులకు భయపడతానా..?
- రిజర్వేషన్లు పెంచాల్సి వస్తుందనే.. కులగణన చేయకుండా బీజేపీ కుట్ర
- రాష్ట్రంలో ఆరు గ్యారంటీల్లో ఐదింటిని అమలు చేశాం
- ఆగస్టు 15న రెండు లక్షల రుణమాఫీ
- ఆ రోజే సిద్దిపేటకు స్వాతంత్ర్యం : నియోజకవర్గాల సభల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



టైమ్స్ ఆఫ్ వార్త - హైదరాబాద్ :

"దేశంలో బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే.. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లను రద్దు చేస్తుంది.. నేను మాట్లాడితే కేంద్ర హొంమంత్రి అమిత్‌షా ఢిల్లీ పోలీసులతో నాపై కేసు పెట్టించారు.. కేసీఆర్ నన్ను జైలుకు పంపించినా భయపడలేదు. మోడీ పెట్టే కేసులకు భయపడతానా..? ఢిల్లీ సుల్తానులను ఎదిరించే శక్తి నాకు ఉంది" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం కుమురంభీం ఆసిఫాబాద్, మెదక్ జిల్లా సిద్దిపేట, కుత్బుల్లాపూర్‌లో నిర్వహించిన జనజాతర సభల్లో ముఖ్యమంత్రి ప్రసంగించారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ కలిసి దేశంలో రిజర్వేషన్లు రద్దు చేసే కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు. పదేండ్లకోసారి దేశంలో జనాభా లెక్కలు తీయడంతోపాటు బలహీన తరగతుల కుల గణన చేపట్టాల్సి ఉందని తెలిపారు. కానీ, రిజర్వేషన్లు పెంచాల్సి వస్తుందనే ఉద్దేశంతో మోడీ కుట్ర చేసి 2021లో జనాభా లెక్కలు చేపట్టకుండా చేశారని విమర్శించారు. దేశంలో బీజేపీకి 400 సీట్లు ఇస్తే ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లు రద్దు చేయాలని చూస్తోందని ఆరోపించారు. రిజర్వేషన్లు రద్దు చేసుకుంటారా..? బీజేపీ ప్రభుత్వాన్ని రద్దు చేస్తారో మీరే తేల్చుకోవాలని ప్రజలకు సూచించారు. పదేండ్ల పాటు దేశాన్ని పాలించిన బీజేపీ తెలంగాణకు ఎలాంటి లబ్ది చేకూర్చలేదని చెప్పారు. బయ్యారం ఉక్కు కర్మాగారం, ఐటీఐఆర్, సీసీఐ, ఐటీడీఏల పూర్వ వైభవం కోసం నిధులు ఇవ్వకుండా.. మోడీ, అమిత్‌షా ఈ రాష్ట్రానికి గాడిద గుడ్డు ఇచ్చారని విమర్శించారు. స్థానిక ఎంపీ సోయం బాపురావు మంత్రుల వద్దకు వెళ్లి ఈ ప్రాంతానికి నిధులు ఇవ్వాలని అడిగినా పట్టించుకోలేదని చెప్పారు. గోండులకు మంత్రివర్గంలో స్థానం కల్పించలేదని, ఈ ఎన్నికల్లో సోయంకు టికెట్ ఇవ్వకుండా బీజేపీ అవమానించిందని అన్నారు. అమిత్‌షా, కేసీఆర్‌లాగా గోడం నగేష్ కూడా ఓ దొరనేనని అన్నారు. దేశంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు పెంచుతుందని చెప్పారు. పదేండ్లపాటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ చేసిందేమీలేదన్నారు. కుమురంభీం ప్రాజెక్టుకు కాల్వల నిర్మాణం చేపట్టలేదని, పోడు భూములు, సాగునీటి సమస్య, వంతెనల నిర్మాణాలను పట్టించుకోకుండా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. ఇక్కడ 17సార్లు లోక్‌సభ ఎన్నికలు జరిగితే ఒక్కసారి కూడా ఇతర పార్టీలు మహిళలకు టికెట్ కేటాయించలేదని.. కాంగ్రెస్ తొలిసారి మహిళకు టికెట్ ఇచ్చిందని గుర్తుచేశారు. ఆదిలాబాద్ ప్రాంతంపై సుగుణక్కకు పూర్తిగా అవగాహన ఉందని, సమస్యల పట్ల చిత్తశుద్ధి, పోరాడే తెగింపు ఉందని, లక్ష ఓట్ల మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ఆరు గ్యారంటీల్లో ఇప్పటికే ఐదు అమలు చేశామని చెప్పారు. త్వరలోనే రాష్ట్రంలో 4.50లక్షల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపడతామని తెలిపారు. బీజేపీకి ఓటేస్తే రిజర్వేషన్ల మీద పోటు పొడిచినట్లేనని చెప్పారు. ఆసిఫాబాద్ సభలో మంత్రి సీతక్క, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలచారి,

మిగతా 7లో..

జనరల్ న్యూస్
GENERAL NEWS
టైమ్స్ ఆఫ్ వార్త
తెలుగు దినపత్రిక
శుక్రవారం,
03-05-2024
2

## మాజీ మంత్రి హరీష్ రావు సమక్షంలో బిఆర్ఎస్ లో చేరికలు



పార్టీ లోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే హరీష్ రావు

టైమ్స్ ఆఫ్ వార్త మెదక్ జిల్లా ప్రతినిధి

మెదక్ బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి గెలుపునకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. గురువారం మెదక్(మెదక్ ) జిల్లా నిజాంపేట మండలం చెలిమెడ గ్రామానికి చెందిన ముదిరాజ్ సోదరులు హరీశ్ రావు సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ.. తప్పుడు హామీలతో అధికారంలోకి వచ్చిన బండారాన్ని బయటపెట్టాలి. ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టించిన కాంగ్రెస్, తెలంగాణకు మొండిచెయ్యి చూపించిన బీజేపీ గురించి ఇంటింటా ప్రచారం చేయాలని కోరారు. బీఆర్ఎస్ పార్టీనే తెలంగాణ ప్రజల పోరాడుతుం దన్నారు. బీఆర్ఎస్ పార్టీలోనే ప్రతి కార్యకర్తకు సరైన గుర్తింపు లభిస్తుందన్నారు. పార్టీలో చేరిన ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటామన్నారు. ఆయన వెంట స్థానిక ప్రజాప్రతినిధులు, కంట తిరుపతిరెడ్డి, భాస్కర్ రావు, మండల ఎంపిటిసి పోరం అధ్యక్షుడు బాల్ రెడ్డి, ఆకుల మహిపాల్, రాగుల బాబు, తదితర బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

# మండలానికి లిఫ్ట్ ఇరిగేషన్ తెచ్చి చూపిస్తా

**భారీ నీటి పారుదల పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి**

టైమ్స్ ఆఫ్ వార్త మోతె







కోదాడ మోతె మండలానికి లిఫ్ట్ ఇరిగేషన్ తెచ్చి చూపిస్తా నని ఈ ఎన్నికల్లో యం పి అభ్యర్థి కుందూరు రఘు వీర్ రెడ్డి నీ అత్యధిక మెజారిటీ తో గెలిపించాలని అన్నారు గురువారం మండల కేంద్రం లో కాంగ్రెస్ పార్టీ నల్ల గోండ పార్ల మెంట్ ఎన్నికల ప్రచార సభలో ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ నల్లగొండ పార్లమెంట్ స్థానంలో కాంగ్రెస్ పార్టీ విజయం ఆపడం ఎవరి తరం కాదని అన్నారు. దేశాన్ని మతోన్మాద మత్తులో దింపి మోడీ దేశాన్ని నాశనం చేస్తే తెలంగాణ సెంటిమెంటుతో తెలంగాణ ప్రజలను మోసం చేసింది కెసిఆర్ బి ఆర్ఎస్ పార్టీ అని తెలియజేశారు. అలాంటి మోసపూరితమైన బిజెపి బిఆర్ఎస్ పార్టీలకు పార్లమెంటు ఎన్నికల్లో తగిన బుద్ధి ప్రజలు చెబుతారని ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు కేంద్రంలోనూ రాష్ట్రంలోనూ కాంగ్రెస్ పార్టీకి దళితులు మైనార్టీలు మేధావులు విద్యావంతులు తమ ఓటు వేసి అఖండ విజయాన్ని కాంగ్రెస్ పార్టీకి అందించబోతున్నారని తెలియజేశారు. ఈ ఎన్నికల సమరంలో దేశ రక్షణ కొరకై వామపక్ష పార్టీలు ఇండియా కూటమితో కలిసి విజయాన్ని సొంతం చేసుకోబోతున్నాయని తెలిపారు. నల్లగొండ కాంగ్రెస్ పార్టీ పార్లమెంటు అభ్యర్థి అయిన కుందూరి రఘువీర్ రెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించవలసిందిగా ప్రజలను కోరారు. మోతె మండలానికి జూనియర్ కాలేజి నీ ఏర్పాటు చేస్తానని రేషన్ కార్డులు కలిగిన ప్రతి నిరుపేదలకు స్వంత ఇంటి నిర్మాణం కోసం ఐదు లక్షలు మంజూరు చేస్తానని గుంజలూరి స్టేజి నుంచి సిరికొండ వరకు డబుల్ రోడ్డు నిర్మాణం సిరికొండ నుంచి తుమ్మల పెన్ ఫాహడ్ వరకు నాయకన్ గూడెం నుంచి కూడలి వరకు డబుల్ రోడ్డు నిర్మాణం చేస్తానని హామీఇచ్చారు అనంతరం వివిధ పార్టీల నుంచి కాంగ్రెస్ పార్టీ లో మంత్రి సమక్షం లో చేరారు కాంగ్రెస్ పార్టీ కి మద్దతుగా తెలుగు దేశం సి పీ యం పార్టీలు మద్దతు ప్రకటించారు ఈ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు ఎన్.పద్మావతి రెడ్డి , మాజీ మంత్రి జానరెడ్డి ,మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్ రావు, మండల ఎంపీపీ ముప్పాని ఆశ, జడ్పిటిసి పందిళ్ళపల్లి పుల్లారావు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కీసర సంతోష్ రెడ్డి, సీనియర్ నాయకులు గురవారెడ్డి , సామ చిన్న వెంకటరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ యువజన సంఘం అధ్యక్షులు వెలుగు వీరన్న, కాంగ్రెస్ పార్టీ నాయకులు బొడ్డు సాలయ్య , ఆంగోతు నాగు నాయక్, మామిడి వెంకటేశ్వర్లు, పులి ఈదయ్య , మాజీ సర్పంచ్ ఎల్లయ్య, గ్రామశాఖ అధ్యక్షులు బొక్క ఉపేందర్ రెడ్డి బొడ్డు నర్సయ్య సాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## నివాళులు

టైమ్స్ ఆఫ్ వార్త చింతకాని



చింతకాని మండలం నాగులవంచ గ్రామానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధులు సీనియర్ టీడీపీ నాయకులు అంబటి వెంకటయ్య (93) భౌతిక కాయానికి టీడీపీ పతాకం కప్పి పూలమాల వేసి నివాళులు అర్పించిన ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ అధ్యక్షులు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం చింతకాని ,బోనకల్ మండలం టీడీపీ అధ్యక్షులు నున్నా తాజుద్దీన్, రావుట్ల సత్యనారాయణ ,గ్రామ టీడీపీ అధ్యక్షులు ఏటుకూరి రవి, మండల టీడీపీ ఉపాధ్యక్షులు తేలుకుంట్ల శ్రీనివాస్, కార్యదర్శి మల్లెల వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు నన్నక గోపాలరావు, సీనియర్ టీడీపీ నాయకులు మల్లెల సత్యంతదితరులు సంతాపం ప్రకటించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు అంబటి వెంకటయ్య పార్టీకి, ప్రజలకు అందించిన సేవలను కొనియాడుతూ రామనాథం మాట్లాడి సంతాపం తెలిపారు.

## అంబటి వెంకటయ్య కి పలువురు నివాళి

టైమ్స్ ఆఫ్ వార్త చింతకాని



నాగులవంచ కు చెందిన స్వాతంత్ర సమరయోధులు , తెలుగుదేశం పార్టీ నాయకులు అంబటి వెంకటయ్య (93) బుధవారం రాత్రి 9.30 గంటలకు కన్ను మూశారు. అంబటి మృతి పట్ల రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు ,సిపిఎం నాయకులు మునుకుంట్ల సుబ్బారావు ,వత్సవాయి జానకి రాములు ,మడుపల్లి గోపాల్ రావు ,నన్నక కృష్ణమూర్తి ,తోటకూర వెంకట నరసయ్య ,బల్లి వీరయ్య,ఆలస్యం రవి ,టిఆర్ఎస్ పార్టీ నాయకులు పెంటాల పుల్లయ్య, మంకెన రమేష్,గురజాల హనుమంతరావు, వంకాయల పాటి లచ్చయ్య, అంబటి వెంకటి,అంబటి లచ్చయ్య,సిలివేరి సైదులు,అంబటి సైదేశ్వర రావు,అంబటి సత్యనారాయణ,కాంగ్రెస్ పార్టీ నాయకులు అంబటి వెంకటేశ్వరరావు, వీరభద్రం,వెచ్చ మంగపతి రావు,అంబటి లచ్చయ్య ఎల్లంపల్లి చిన్న అప్పారావు, ఖమ్మం నాగేశ్వరరావు,బైరు వెంకటేశ్వర్లు,కందిమల్ల రామారావు, సిపిఐ ఎంఎల్ నాయకులు కోలేటి నాగేశ్వరరావు,ఉపాధ్యాయ సంఘ నాయకులు ఎన్ కృష్ణ మోహన,మోతుకూరి మధు,వై వెంకటేశ్వరరావు,కట్టా శేఖర్,తోటకూరి శ్రీనివాసరావు, సుధాకర్,ఎస్ కే కరీముల్లా,వలపర్ల కృష్ణ,రమణారావు,ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి అలీఫ్,సూపర్వైజర్లు కృష్ణారావు, పండరీబాయి, వైద్య సిబ్బంది వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు,మాజీ ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు,ఉపాధ్యాయులు,సధర్భించి పూలమాలలు వేసి గురువారం నివాళులు అరిప్పించారు. అనంతరం నాగులవంచలో అంత్యక్రియలు నిర్వహించారు.

## చౌటుప్పల్ లో హరీష్ రావు రోడ్ షో

టైమ్స్ ఆఫ్ వార్త - సంస్థాన్ నారాయణపురం



రేపు అనగా 3/05/2024 సాయంత్రం 5 గంటలకు మన మాజీ మంత్రివర్యులు హరీష్ రావు , మన జగదీశ్ రెడ్డి మరియు మన ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్ , మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు పాల్వాయి స్రవంతి గారు, పల్లె రవికుమార్ చందూర్ పట్టణంలో రోడ్ షో కార్యక్రమంలో పాల్గొంటారు కావున పుట్టపాక గ్రామ పంచాయతీ నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు అధికసంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని చౌటుప్పల్ నుంచి కారు ర్యాలీ గా వస్తున్నారు 4 గంటలకు నారాయణపురం నుంచి కార్ల ర్యాలీ బయలుదేరాలి. సకాలంలో ఈ ర్యాలీ లో పాల్గొని విజయవంతం చేయగలరని మనవి.

## అంబటికి సానుభూతిని తెలియజేసిన బిజెపి పార్లమెంట్ అభ్యర్థి తాండ్ర .



టైమ్స్ ఆఫ్ వార్త చింతకాని

చింతకాని మండలం నాగులవంచ గ్రామానికి చెందిన స్వాతంత్ర సమరయోధులు తెలుగుదేశం పార్టీ నాయకులు అంబటి వెంకటయ్య (93) బుధవారం రాత్రి కన్నుమూశారు. ఈ విషయాన్ని తెలుసుకున్న ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి తాండ్ర వినోద రావు అంబటి ఇంటి వద్దకు వచ్చి తన ప్రకాడ సానుభూతిని తెలియజేసి,వారి కుమారులు అంబటి శాంతయ్య ని,కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించి చింతించకుండా ధైర్యంగా ఉండమని చెప్పడం జరిగింది. నివాళులర్పించిన వారిలో చింతకాని మండల బిజెపి యువమోర్చ అధ్యక్షులు కొండా గోపి తో పాటు, జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు మద్దినేని వెంకటేశ్వర్లు మరియు బూత్ అధ్యక్షులు నాయుడు నాగేశ్వరరావు, బల్లి పిచ్చారావు, సుందర్రావు, బుర్ర శ్రీను పాల్గొన్నారు.

## మోడీ పాలనలో పేద వర్గాలకు మొండి చేయి

**తెలంగాణ ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ ఆచార్య కూరపాటి వెంకట్ నారాయణ**



టైమ్స్ఆఫ్ వార్త-వరంగల్ జిల్లా:

మోడీ పాలనలో 80 కోట్ల ప్రజలకు రేషన్ బియ్యం పంపిణీ చేయడం అంటే 80 కోట్ల మంది దేశంలో నిరుపేదలుగా ఉన్నట్లేనని తెలంగాణ ప్రజా సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ ఆచార్య కూరపాటి వెంకట్ నారాయణ ఆందోళన చెందారు. గురువారం వర్ధన్నపేట పట్టణ కేంద్రంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రపంచంలో అత్యంత ధనవంతులైన కుబేరులు భారతదేశంలో వెలుగుతున్నారని, 80 కోట్ల పేద ప్రజలు ఆర్థిక సంక్షోభంలో చిక్కిపోయారని, 30 కోట్ల యువకులు నిరుద్యోగులుగా మిగిలారని, ఇందుకు మోడీ పాలన కారణం కాదా..? అని ప్రశ్నించారు. దేశంలోని 450 ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు కేంద్ర నిధులు లేక పరిశోధనలు కుంటుపడ్డాయని, విద్యార్థులకూ వసతి గృహలు హాస్టల్స్ లేక నిర్వీర్యం అయినాయని అన్నారు. మోడీ పాలనలో దేశంలో వందలాది ప్రైవేటు విశ్వవిద్యాలయాలు, వేలాది కార్పొరేట్ కళాశాలలు పేద ప్రజల రక్తాన్ని పీడిస్తుంటే, కేంద్రం చోద్యం చూస్తూ ఉందని ఎద్దేవా చేశారు. గత పది సంవత్సరాల కాలంలో 8 లక్షల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే, రైతుకు కనీస మద్దతు ధర కల్పించాలని ఢిల్లీ కేంద్రంగా ధర్నా చేసినప్పుడు 750 మంది పేద రైతులను పొట్టన పెట్టుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఐనా మోడీ రైతు పక్షాన నిలబడలేకపోయాడని, అందుకే రాష్ట్రంలో మార్పు కోరినట్లే కేంద్రంలో కూడా దేశ ప్రజలు మోడీని మార్చేందుకు సిద్ధమైనారని, అందులో భాగంగా తెలంగాణ ప్రజలు కూడా ప్రభుత్వాన్ని మార్చే దిశలో కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టిన అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. ప్రజా సంఘాల జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్, పూలే ఆశయ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సంగని మల్లేశ్వర్ మాట్లాడుతూ... దశాబ్ద కాలంగా బడుగుల కుల గణన చేయని మోడీకి బై బై చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ మంద వీరస్వామి, బీసీ న్యాయవాదుల సంఘం నాయకులు గునిగంటి శ్రీనివాస్ గౌడ్, దయాల సుధాకర్, రాచకొండ ప్రవీణ్, కనకాచారి తదితరులు పాల్గొన్నారు.

## సర్వేల్ గ్రామలో శ్రీశ్రీశ్రీ నాభిశిల పునఃప్రతిష్ఠా ప్రథమ వార్షికోత్సవము



టైమ్స్ ఆఫ్ వార్త - సంస్థాన్ నారాయణపురం

లియాదాద్రి భువనగిరి జిల్లా నారాయణపురం మండలం సర్వేల్ గ్రామంలో నాభిశిల (బొడ్రాయి)కి గ్రామంలో ఉన్న ఇంటి ఆడపిల్లలచే జలాభిషేకం చేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమములు సర్వేల్, మర్రిగూడెం, ఎర్రగుంట, చిట్టెన్నబాయి, దేవిరెడ్డిగూడెం గ్రామములోని నాభిశిలలకు జరులబడింది. ఇట్టి కార్యక్రమములు గ్రామ పురోహితులు బ్రహ్మశ్రీ మహేష్ శర్మ గారిచే, వేద పండితులచే జరుపబడింది. ఈ కార్యక్రమంలో శ్రీ రామలింగేశ్వరస్వామి దేవాలయ కమిటి %డ% ఛైర్మన్, శ్రీ గుత్తా శేఖర్ రెడ్డి, %గ్రూజ% విరమల్ల భానుమతి వెంకటేష్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు షేక్ షబ్బీర్ అలీ, రామలింగేశ్వర స్వామి దేవాలయ కమిటీ మాజీ చైర్మన్ ఎల్లంకి చంద్రయ్య గౌడ్, మాజీ సర్పంచ్ మనుపాటి సతీష్ కుమార్, మునుగోడు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి చిలకరాజు రాజు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు సుర్వి యాదయ్య గౌడ్ పగిల్ల యాదయ్య, నారాయణపురం మండలం యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు చెరుకు నరేష్ గౌడ్, సుక్క స్వామి చర్ల మహేష్ చిలక రాజు విజయ్ ఎల్లంకి నరేష్ వరికుప్పల నరేష్ వీరమల్ల శివానంద్ వరికుప్పల మైసయ్య వడ్డేపల్లి రాజు నలపరాజు వెంకటయ్య, ఎల్లంకి సాయి, కట్టూరి జగత్ కుమార్, సురేష్ బూరుగు ప్రవీణ్ చిలక రాజు నితిన్ మరియు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ పార్టీ జనరలజనరల్ బాడీ సమావేశంలో మంత్రివర్యులు



టైమ్స్ ఆఫ్ వార్త ఖమ్మం

ఇండియా కూటమి పొత్తులో భాగంగా సిపిఐ పార్టీ బలపరుస్తున్న ఖమ్మం పార్లమెంట్ స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి శ్రీ రామ సహాయం రఘురాం రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ ఈ రోజు ఖమ్మంలోనే ఎస్ఆర్ గార్డెన్లో జరిగిన సిపిఐ పార్టీ ఖమ్మం పార్లమెంట్ స్థాయి జనరల్ బాడీ సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి.

## మూడోసారి ప్రధానిగా మోడీని గెలిపించాలి

టైమ్స్ ఆఫ్ వార్త, మందమర్రి:-



బిజెపి, నరేంద్ర మోడీ నాయకత్వంలోనే దేశ అభివృద్ధి, భద్రత సాధ్యమవుతుందని, దేశ ప్రధానిగా ముచ్చటగా మూడోసారి నరేంద్ర మోడీని గెలిపించాలని బిజెపి మహిళా జిల్లా అధ్యక్షురాలు జోగుల శ్రీదేవి, పెద్దపెల్లి బిజెపి ఎంపీ అభ్యర్థి గోమాసె శ్రీనివాస సతీమణి గీత, పట్టణ మహిళా అధ్యక్షురాలు మల్యాల పార్వతీ లు తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం పట్టణంలో వారు ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ బీజేపీ కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి, పెద్దపల్లి ఎంపీగా గోమాసె శ్రీనివాస్ ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి పట్టణ అధ్యక్షుడు మార్త కుమారస్వామి, నియోజకవర్గ మహిళ ప్రధాన కార్యదర్శి మచ్చ స్వప్న, బెల్లంపల్లి నియోజకవర్గ మహిళా ప్రధాన కార్యదర్శి గోమాసె కమల, పట్టణ మహిళా ప్రధాన కార్యదర్శులు మార్త రమణి రావు, చీట్ల స్వప్న, కోశాధికారి జె రాణి, మహిళా ఉపాధ్యాయురాలు షామిలి ఠాకూర్, మహిళ నాయకురాలు పెగడ భాగ్య, గుగ్గిల యమున, గంట రజిత, బైరి రజిత, బి రాజేశ్వరి, పార్టీ పట్టణ ఉపాధ్యక్షుడు తుపాకుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మల్లోజుల అభిలాష్, పోలింగ్ బూత్ అధ్యక్షులు పోతునూరి కమల, గుమాస గంగ, ఎం మంగ, నాయకులు కే శివ, రాంటెంకి దుర్గరాజు, పిట్ట రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

## మాసు రాకేష్ జ్ఞాపకార్థం క్రికెట్ టోర్నమెంట్



టైమ్స్ ఆఫ్ వార్త, మందమర్రి:-

పట్టణ మున్సిపాలిటీ పరిధిలోని ఊరు రామకృష్ణాపూర్ గ్రామానికి చెందిన మాసు రాకేష్ గత సెప్టెంబర్ మాసంలో మృతిచెందగా, ఆయన జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు గ్రామ సమీపంలోని కల మైదానంలో గురువారం మాసు రాకేష్ స్మారక క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో రాకేష్ కుటుంబ సభ్యులు మాట్లాడుతూ, రాకేష్ మృతి బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. రాకేష్ జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు కుదిరే అంజన్న, బొంతు రమేష్, గొర్ల రామచందర్, బండ రవి, బండ శ్రీనివాస్, మంద సురేష్, రాకేష్ కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# మిగిలింది ఇంకా 8 రోజులే..

### లోక్ సభ ఎన్నికల ప్రచారంలో అభ్యర్థుల దూకుడు

### ప్రచారంలో పట్టువదలని రఘునందన్ రావు

### బీ ఆర్ ఎస్ పార్టీలో అన్ని తానే నడిపిస్తున హరీష్ రావు

### కాంగ్రెస్ లో జోష్ నింపేందుకు సీఎం రేవంత్

### ప్రచారంపై ఎండల ప్రభావం

టైమ్స్ అఫ్ వార్త – మెదక్ జిల్లా ప్రతినిధి

నామినేషన్ల ఉపసంహరణ ఘట్టం ముగియడంతో అభ్యర్థుల ప్రచారం ఒక్కసారిగా ఉధృతమైంది. ప్రచారానికి ఇంకా పదిరోజులే మిగలడంతో అభ్యర్థులు హోరాహోరీగా పర్యటి స్తున్నారు. ఓ వైపు ఎండలు మండుతున్నప్పటికీ సమయం తక్కువగా ఉండడంతో ప్రచారంపైనే దృష్టిసారిస్తున్నారు. ప్రత్యక్షంగా ప్రజలను కలుస్తూ తమను గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు. బీఆర్ఎస్ పార్టీకి కంచుకోటగా ఉన్న మెదక్ పార్లమెంట్ స్థానంలో పాగా వేయాలని ఇటు బీజేపీ అటు కాంగ్రెస్ పార్టీలు ప్రయత్నిస్తున్నాయి. అయితే తమ స్థానాన్ని పదిలంగా ఉంచుకోవడానికి బీఆర్ఎస్ సైతం సర్వత్రా ముందుకెళ్తోంది. ఒకరికి స్థానికంగా బలం ఉండగా, మరో ఇద్దరికి కేంద్రంలో, రాష్ట్రంలో అధికారమే బలమైంది. ఆ ధీమాతోనే ఎవరికివారు ప్రచారంలో దూకుడు పెంచుతున్నారు.

#### రఘునందన్‌రావు విస్తృతంగా...

గత పార్లమెంటు ఎన్నికల్లోనూ ఎంపీగా పోటీచేసి ఓడిపోయిన బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు సైతం విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. లోక్‌సభ నియోజకవర్గంపై పూర్తిగా పట్టున్న నేపథ్యంలో ప్రణాళిక బద్ధమైన ప్రచారం చేస్తున్నారు. తాను అభ్యర్థిగా ఎంపికైన నాటి నుంచి ఒక షెడ్యూల్ ప్రకారం సమావేశాలు, రోడ్‌షోలు, అంతర్గత మీటింగ్‌లు, కాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తున్నారు. మెదక్‌లో తన నామినేషన్ కార్యక్రమానికి గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్‌ను తీసుకొచ్చారు. ఇటీవల సిద్దిపేటలో అమిత్‌షాతో బహిరంగ సభ నిర్వహిం పజేశారు. తాజాగా అల్లాదుర్గంలో ప్రధాని మోదీ సభకు మెదక్ లోక్‌సభ కార్యకర్తలు, ప్రజలను తరలించారు. వీటితోపాటు క్షేత్రస్థాయిలో కాషాయదళాన్ని అప్రమత్తం చేస్తున్నారు. ఇంటింటి ప్రచారం నిర్వహించేలా వెంటపడుతు న్నారు. తాను కూడా ఈ కాస్త సమయాన్ని వినియోగించు కునేలా దృష్టి పెట్టినట్లుగా తెలుస్తోంది. ఈ ఒక్కసారితనకు అవకాశంకల్పించాలని వేడుకుంటున్నారు. కేంద్రంలోని మోదీ చరిష్మా తనకు కలిసి వస్తుందని భావిస్తున్నారు.

#### వెంకట్రామారెడ్డి వెన్నంటే హరీశ్..

బీఆర్ఎస్ అభ్యర్థిగా వెంకట్రామారెడ్డిని ప్రకటించిన క్షణం నుంచి ఇప్పటిదాకా మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆయన వెన్నంటే ఉంటున్నారు. మెదక్ స్థానాన్ని నిలబెట్టుకోవాలని హరీశ్ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా ప్రతికూల పరిస్థితి ఎదురుకావడంతో మునుపటి జోష్‌ను రేకెత్తించేలా విజయం కోసం ప్రయత్నిస్తున్నారు. మెదక్ లోక్‌సభ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో ఆరింట్లోనూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే ఉండడం ఆ పార్టీకి లాభించే విషయంగా భావిస్తున్నారు. ఈ ప్రాంతంపై పూర్తిగా పట్టున్న హరీశ్‌రావు తనదైన శైలిలో ప్రణాళిక సిద్ధం చేయడంతో వెంకట్రామారెడ్డి ప్రచారం సులభతరమవుతోంది. అంతేగాకుండా మండల కేంద్రాల్లో రోడ్‌షోలు, ఉదయం వేళలో మార్నింగ్ వాక్ కార్యక్రమాలు, మధ్యాహ్న సమయాల్లో పలు వర్గాల వారీగా సమావేశాలు నిర్వహిస్తూ ముందుకెళ్తున్నారు. జనసమీకరణకు తగిన ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈనెల 10న సిద్దిపేటలో కేసీఆర్ హాజరయ్యే సభకు పెద్ద ఎత్తున ప్రజలను సమీకరించాలని కసరత్తు చేస్తున్నారు.

#### రేవంత్‌పైనే కాంగ్రెస్ అభ్యర్థి ఆశలు..

ప్రచారంలో బీఆర్ఎస్, బీజేపీతో పోల్చితే కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు నెమ్మదిగా పుంజుకుంటున్నారు. క్షేత్రస్థాయి ప్రచారంలో ఇప్పుడిప్పుడే నిమగ్నమయ్యారు. మెదక్‌లో ఒకసారి రేవంత్‌రెడ్డి రోడ్‌షోను నిర్వహించగా ఆ ఉత్సాహాన్ని కాపాడుకోలేకపోయారనే విమర్శలు ఉన్నాయి. తాజాగా నేడు సిద్దిపేటలో రేవంత్‌రెడ్డి రోడ్‌షో జరగనున్నది. మెదక్ పార్లమెంటు పరిధిలో రేవంత్‌ది ఇదే చివరి సభ అయ్యే అవకాశం కూడా లేకపోలేదు. కనీసం ఇప్పుడైనా రేవంత్ క్రేజ్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లే విధంగా శ్రమించాలని ఆ పార్టీ నేతలే అంటున్నారు. దీనికితోడు పలు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీలో అసంతృప్తుల గళం వినిపిస్తోంది. ఎంపీ అభ్యర్థి తమను పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. లోక్‌సభ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో పలుచోట్లా నీలం మధుకు సొంత పార్టీలోనే ఆశించిన మద్దతు దక్కడం లేదనే అభిప్రాయాలున్నాయి. ఇటు రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్‌రెడ్డి చరిష్మాతోపాటు తన బీసీ కార్డును ఉపయోగిస్తూ పలు సమావేశాల్లో మాట్లాడుతున్నారు. ప్రధానంగా బీఆర్ఎసకు కంచుకోటలుగా ఉన్న సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పట్టుకోసం ప్రయత్నిస్తున్నా సత్ఫలితాలు రావడం లేదనే చర్చ జరుగుతోంది.

# రాజ్యాంగాన్ని వంద సార్లు సవరించిన ఘనత కాంగ్రెస్ దే..!

### కాంగ్రెస్ ప్రభుత్వం పై తీవ్ర విమర్శలు చేసిన బిజెపి ఎంపీ అభ్యర్థి రఘునందన్ రావు



టైమ్స్ అఫ్ వార్త – మెదక్ జిల్లా ప్రతినిధి

కాంగ్రెస్ పార్టీపై బీజేపీ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి రఘునందన్ రావు తీవ్ర విమర్శలు చేశారు. గురువారం గజ్వేల్ మండలం రిమ్మనగూడలో రఘునందన్ రావు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగాన్ని బీజేపీ ఏనాడూ అగౌరవ పర్చలేదని అన్నారు. ఇప్పటికీ 126 సార్లు రాజ్యాంగాన్ని సవరించారని గుర్తుచేశారు. అందులో 100 సార్లు కాంగ్రెస్ పార్టీనే మార్పులు చేసిందని అన్నారు. రాజ్యాంగాన్ని మారుస్తారంటూ సీఎం రేవంత్ రెడ్డి బీజేపీపై అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్ వంద అబద్ధాలు ఆడితే.. రేవంత్ రెడ్డి వెయ్యి అబద్ధాలు ఆడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతకుముందు బీఆర్ఎస్ అభ్యర్థిపై రఘునందన్ రావు విమర్శలు చేశారు. కొత్త ప్రభాకర్ రెడ్డి ఎంపీగా ఉన్నప్పుడు హరీష్ రావుకు పాలేరుగా ఉన్నారని.. కాని దుబ్బాకకు ఎన్నడూ రూపాయి తేలేదని విమర్శించారు. ఇప్పుడు మరో పాలేరు తయారు అయ్యారని.. కలెక్టర్గా పనిచేసిన వ్యక్తి హరీష్ రావు వద్ద పాలేరుగా పనిచేందుకు రెడీ అయ్యారని సెటైర్ వేశారు. తాను ప్రజలకు పాలేరును అని చెప్పారు. మెదక్, దుబ్బాక అభివృద్ధిపై బీఆర్ఎస్ నేతలు కేసీఆర్, హరీష్ రావు, కేటీఆర్ తనతో చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఓబీసీలకు రావాల్సిన సీట్లను తీసుకుపోయి ముస్లిం మైనార్టీలకు కాంగ్రెస్ ఇచ్చిందన్నారు. ఆ రిజర్వేషన్లను బీజేపీ రద్దు చేస్తుందని స్పష్టం చేశారు.

## అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కాంగ్రెస్తోనే సాధ్యం



టైమ్స్ ఆఫ్ వార్త, మందమర్రి:-

దేశంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కేవలం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు. జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి, చెన్నూరు ఎమ్మెల్యే డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి తనయుడు గడ్డం వంశీకృష్ణ ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ పట్టణంలోని అన్ని పోలింగ్ బూతులలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం సైతం జోరుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రతి ఇంటికి వెళ్లి కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అమలు చేస్తున్న 6 గ్యారంటీలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, గడ్డం వంశీకృష్ణ ను ఎంపీ గా గెలిపించాల్సిందిగా కోరారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి అధికారంలోకి వచ్చిన అనంతరం రాష్ట్రం లోని ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉన్నారని, అదేవిధంగా రాహుల్ గాంధీ నాయకత్వంలో కేంద్రంలో సైతం కాంగ్రెస్ అధికారంలో వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. పెద్దపెల్లి నియోజకవర్గం లో గడ్డం వంశీ విజయం దాదాపు ఖరారు అయిందని, సుమారు 5 లక్షల మెజార్టీతో గడ్డం వంశీ కృష్ణ ఎంపీ గా విజయం సాధించబోతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## తిరిగి కాంగ్రెస్లో చేరిన సునార్కర్ రాంబాబు



టైమ్స్ ఆఫ్ వార్త, మందమర్రి:-

నేతకాని మహార్ సంఘం నాయకులు, బిఆర్ఎస్ నేత సునార్కర్ రాంబాబు బిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి, కాంగ్రెస్ నేత దుర్గం నరేష్ ఆధ్వర్యంలో చెన్నూరు ఎమ్మెల్యే డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి సమక్షంలో గురువారం తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ, పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి, ఎమ్మెల్యే వివేక్ తనయుడు గడ్డం వంశీ కృష్ణ గెలుపునకు కృషి చేస్తానని తెలిపారు. బడుగు బలహీనవర్గాలు, దళితులు, ఆదివాసుల అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుందని, అంబేద్కర్ ఆశయాల సాకారం కొరకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. అంబేద్కర్ ఆలోచన విధానాలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు పరుస్తోందన్నారు. అన్ని రంగాల్లో దళితులకు, ఆదివాసులకు, బలహీనవర్గాలకు కాంగ్రెస్ ప్రభుత్వం సముచిత స్థానం కల్పిస్తూ వస్తుందని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీ పథకాలు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడే పథకాలన్నీ,నిత్యం ప్రజల సంక్షేమ కోసం కేవలం కాంగ్రెస్ పార్టీ మాత్రమే పని చేస్తుందన్నారు. పెద్దపల్లి ఎంపీగా గడ్డం వంశీకృష్ణ గెలిస్తే, పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాలు అభివృద్ధి పథంలో దూసుకుపోతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నేతకాని సేవా సంఘం నాయకులు దుర్గం పోశం, దుర్గం సిద్ధ రాంమూర్తి పాల్గొన్నారు.

# నేతకానిల సమస్యలు పరిష్కరించాలి

### రాష్ట్ర ముఖ్యమంత్రి కి వినతిపత్రం

టైమ్స్ ఆఫ్ వార్త, మందమర్రి:-

రాష్ట్రవ్యాప్తంగా నేతకాని (మహార్) కులస్తుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ నేతకాని (మహార్) సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాడి నర్సయ్య కోరారు. ఈ మేరకు బుధవారం జగిత్యాల బహిరంగ సభలో రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ, రాష్ట్ర గెజిట్ లో నేతకాని కులస్తుల కుల ధ్రువీకరణ పత్రం నెట్కాని అని అచ్చు తప్పుగా వస్తుందని, దానిని సరిచేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ గెజిట్ లో సైతం నేతాని అని వస్తుందని, దానిని సైతం నేతకాని గా మార్చాలన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర రాజధానిలో నేతకాని కుల భవనానికి స్థలాన్ని కేటాయిస్తామని ఇచ్చిన హామీ ఆ ప్రభుత్వ హాయంలో నెరవేరాలేదని, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నైనా రాష్ట్ర రాజధానిలో నేతకాని భవనానికి స్థలం కేటాయించాలని కోరారు. అదేవిధంగా నేతకాని కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా బ్యాంకు లింక్ లేకుండా రుణాలు మంజూరు చేయాలన్నారు. అదేవిధంగా దళితులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని, ఏజెన్సీ ప్రాంతంలోని దళితులకు 15 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. సామాజిక స్పృహతో కాంగ్రెస్ పార్టీకి అండగా ఉంటున్న నేతకాని కులాన్ని గుర్తించి నామినేట్ పదవులో నేతకాని కులస్తులకు అవకాశం కల్పించాలని కోరారు.



## స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించుకోవాలి

### మందమర్రి సీఐ కే శశిధర్ రెడ్డి

టైమ్స్ ఆఫ్ వార్త, మందమర్రి:-



జరగనున్న పార్లమెంట్ ఎన్నికలు పకడ్బందీగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించుకోవాలని మందమర్రి సిఐ కే శశిధర్ రెడ్డి పిలుపునిచ్చారు. రామగుండం పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాస్ ఐజి, ఐపిఎస్, మంచిర్యాల డిసిపి అశోక్ ఐపిఎస్, బెల్లంపల్లి ఏసిపి రవికుమార్ ల ఆదేశాల మేరకు గురువారం మందమర్రి సిఐ కే శశిధర్ రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలో కేంద్ర (బిఎస్ఎఫ్) బలగాలు, పోలీస్ సిబ్బందితో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని సింగరేణి ఏరియా జిఎం కార్యాలయం నుండి ఇల్లందు క్లబ్ మీదుగా పాత బస్టాండ్ వరకు ఫ్లాగ్ మార్క్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ శశిధర్ రెడ్డి మాట్లాడుతూ, పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ప్రజలకు భద్రత భావం కలిగించేలా ఫ్లాగ్ మార్చ్ నిర్వహించామని తెలిపారు. ప్రజలందరూ ఎలాంటి ప్రలోభాలకు,భయభ్రాంతులకు లొంగకుండా,నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకొని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించకుండా ప్రజలందరూ పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఎస్ఎఫ్ ఇన్స్పెక్టర్ రాకేష్ మిశ్రా, పట్టణ ఎస్ఐ ఎస్ రాజశేఖర్, కాసీపేట ఎస్ఐ ప్రవీణ్ కుమార్, రామకృష్ణాపూర్ ఎస్ఐ రాజశేఖర్, బిఎస్ఎఫ్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నేడే బాన్సువాడ భారత్ గార్డెన్స్ లో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం

### ఎంపీ అభ్యర్థి సురేష్ హెడ్కర్ రాక....

టైమ్స్ ఆఫ్ వార్తు బాన్సువాడ:

బాన్సువాడ మున్సిపల్ కేంద్రంలోని భారత్ గార్డెన్స్ ఆవరణలో శుక్రవారం ఉదయం పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బాన్సువాడ నియోజకవర్గం కార్యకర్తల ప్రత్యేక సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు బాన్సువాడ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మాసాని చంద్రశేఖర్ రెడ్డి గురువారం ఒక ప్రకటన లో పేర్కొన్నారు. ఈ సమావేశానికి కాంగ్రెస్ పార్టీ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి సురేష్ షట్కర్ తో పాటు బాన్సువాడ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ,మాజీ ఎమ్మెల్యే, ఏనుగు రవీందర్ రెడ్డిలు హాజరై మార్గదర్శకం చేయనున్నారని ఆయన పేర్కొన్నారు. బాన్సువాడ పట్టణంతోపాటు మండలం, నియోజకవర్గంలోని అన్ని మండలాల కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులు, అందరు సకాలంలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## హెచ్ఎంఎస్ కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడిగా పార్వతి రాజిరెడ్డి

### రద్దైన మందమర్రి ఏరియా కమిటీ

టైమ్స్ ఆఫ్ వార్త, మందమర్రి:-



సింగరేణి మైనర్స్ అండ్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ (హెచ్ఎంఎస్) కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడిగా ఏరియాకు చెందిన పార్వతీ రాజిరెడ్డి ఎన్నిక కాబడ్డారు. ఇటీవల గోదావరిఖని పట్టణంలోని హెచ్ఎంఎస్ కార్యాలయంలో నిర్వహించిన కేంద్ర కార్యవర్గ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకోవడం జరిగిందని యూనియన్ నాయకుడు వెల్ది సుదర్శన్ గురువారం ప్రకటనలో తెలిపారు . ఈ సందర్భంగా సుదర్శన్ మాట్లాడుతూ, కేంద్ర కార్యవర్గ సమావేశానికి హెచ్ఎంఎస్ కేంద్ర ప్రధాన కార్యదర్శి, వేజ్ బోర్డ్ సభ్యుడు రియాజ్ అహ్మద్ ముఖ్య అతిథిగా హాజరుకాగా, సమావేశానికి యూనియన్ అధ్యక్షుడు జక్కుల నారాయణ అధ్యక్షత వహించారని తెలిపారు. ఈ సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. అందులో ప్రధానంగా యూనియన్ ఆర్గనైజేషన్ లో ఖాళీగా ఉన్న పోస్టులను నియమించేందుకు పూర్తి నిర్ణయాధికారులు యూనియన్ ప్రధాన కార్యదర్శి, అధ్యక్షులు, కోశాధికారులకు అప్పగించడం జరిగిందన్నారు. అదేవిధంగా హెచ్ఎంఎస్ మందమర్రి ఏరియా కమిటీని పూర్తిగా రద్దు చేయడంతో పాటు నూతన కమిటీని మే 4న ఎన్నుకోవడం జరుగుతుందని సమావేశంలో తీర్మానించడం జరిగిందని తెలిపారు. ఇంతకముందు ఏరియా ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించిన పార్వతీ రాజిరెడ్డి ని కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు నియమించడం జరిగిందన్నారు.

## ఎన్నికల అధికారులకు రెండవ విడత శిక్షణ తరగతులు



టైమ్స్ ఆఫ్ వార్తు బాన్సువాడ:

బాన్సువాడ రెవెన్యూ డివిజన్ కేంద్రానికి అతి సమీపంలో ఉన్న ఎస్ ఆర్ ఎన్ కె ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో గురువారం పార్లమెంట్ ఎన్నికల అధికారులకు ప్రత్యేకంగా రెండవ విడత శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈనెల 13న నిర్వహించే పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో, సజావుగా పూర్తయ్యే విధంగా తీసుకోవలసిన జాగ్రత్తలు చర్యలపై ఎన్నికల అధికారులకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బాన్సువాడ ఆర్డిఓ రమేష్ రాథోడ్ తో పాటు పి ఓ లు, ఏపీవోల తోపాటు సంబంధిత పోలింగ్ అధికారులు, తదితరులు, పాల్గొన్నారు.

జనరల్ న్యూస్
GENERAL NEWS
టైమ్స్ ఆఫ్ వార్త
తెలుగు దినపత్రిక
శుక్రవారం,
03-05-2024


# తుంగతుర్తి ఐకెపి సెంటర్లలో హవా ఇష్టా రాజ్యాంగ మహిళా సంఘాలు

**కాంటావేసిన బస్తాలకు రిసిప్ట్ ఇవ్వడం లేదు**

**ఇబ్బంది పడుతున్న రైతులు**

**పట్టించుకోని వ్యవసాయ అధికారులు**

టైమ్స్ ఆఫ్ వార్త సూర్యాపేట జిల్లా ప్రతినిధి



తుంగతుర్తి మండల కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలలో మహిళా సంఘాలలో రైతుల ధాన్యం కాంట్రా వేసిన తర్వాత బిల్లు లేవు రైతుల ధాన్యాలకు ఐకెపి సంఘాలలో కాంట్రా వేసిన బస్తాల లెక్కల చిట్టి లేదు రైతులు గగ్గోలు పెడుతున్న పట్టించుకోని అధికారులు కనీసం మ్యాచరు చూడడానికి కూడా అగ్రికల్చర్ అధికారులు కరువు ఐకెపి సెంటర్లలో సంఘాలదే రాజ్యం రైతుల బాధలు పట్టించుకోని మండలాధికారులు కనీసం పట్టాలు కూడా ఇవ్వలేని స్థితిలో ఐకెపి సెంటర్లు తుంగతుర్తి మండల పరిధిలోని పలు గ్రామాలలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులు ఆరబోసి ఎండబోసి గత పది రోజుల నుండి వారి ధాన్యం కాంటాలు వేసుకోవడం ఆధార్ కార్డులను ఆన్లైన్లో పెట్టడం ఆ తర్వాత వారి పాసుబుక్కును జిరాక్సులు ఆధార్ కార్డు జిరాక్సు తీసుకొని లారీలకు ఆన్లైన్ కు చేసి వారి ధాన్యాలను తరలిస్తున్నారు. అయినప్పటికీ రైతులకు ఎన్ని బస్తాలు కాంట్రాబెట్టిన చీటీలు మాత్రం ఇవ్వకపోవడంతో రైతులు బెంబేలుచుతున్నారు గత కొన్ని రోజుల క్రితం ఈ మండలంలో ఒక రైతు వారి ఆధార్ కార్డు పాస్ బుక్ కాగితాలు ఇచ్చి వారి ధాన్యాన్ని లారీలో వేసుకొని పోయి మరల ఇప్పుడు మీ పాస్ బుక్ కాగితాలు ఆధార్ కార్డు కాగితాలు మరల ఇవ్వాలని రైతుకు చెప్పడంతో ఆ రైతు నేను గత కొన్ని రోజుల క్రితం కాంట వేసి నాతోపాటు కొంతమంది రైతుల పాసుబుక్కులు ఆధార్ కార్డు ఆన్లైన్ చేసి లారీ ఎత్తానని నాకు బిల్లు ఇవ్వమని అడగడంతో అక్కడ ఉన్న ఐకెపి కేంద్ర మహిళా సంఘాలు చిట్టి వే సేయడం ఏమీ లేదు నీవు ధాన్యం కాంటా వేసి ఎత్తినది వాస్తవమే కానీ నీది ఆ లారీలో ఆధార్ కార్డు పాసుబుక్కు కాగితాలు ఎక్కువ పోవడంతో నీ ధాన్యం బస్తాలను ఆ మిల్లులోనే పక్కకు దింపినట్లుగా చెబుతున్నది ఇది ఏందని అడగడంతో అది అంతే ఉంటుంది ఆరోజు ఆన్లైన్ కాలేదు నీ పేరు మీద ఉన్న ధాన్యం బస్తాలు పక్కకు దిగుమతి చేశారు అని ఆ సంఘం అధ్యక్షురాలు చెప్పడంతో రైతుకు వణుకు పుట్టింది తుంగతుర్తి మండలానికి చెందిన రైతు నాకు అన్యాయం జరిగింది నేను దాదాపు 90 నుండి 95 బస్తాలు కాంట వేసి ఆరోజు లారీలో పంపించాము కొంతమంది రైతులతో కలిపి నాకు ఎలాంటి చిట్టి ఇవ్వకపోవడం తో నాకు న్యాయం చేయగలరని అధికారులను కోరుతున్న రైతు ఇలా కొన్ని ఐకేపీ కేంద్రాలలో మహిళా సంఘాలలో ధాన్యం రాశులు రోజు వందల బస్తాలు వేస్తున్నప్పటికీ రైతులకు మాత్రం ఎగుమతి చేసుకున్న చిట్టీలు మాత్రం ఇవ్వకపోవడంతో రైతులు బెంబేలెత్తుతున్నారు. తక్షణమే తుంగతుర్తి మండలంలోని ఏపియం నరసయ్యను వివరణ అడగగా అలాంటివి ఏమీ రైతులు మాకు చెప్పలేదని మాకు తెలవదని వివరణ ఇచ్చారు. మా దృష్టికి ఇప్పుడే చెప్పడంతో ఇలాంటి జరగకుండా చూస్తామన్నారు.

# వేసవి క్రీడ శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి



టైమ్స్ ఆఫ్ వార్త, మందమర్రి:-

సింగరేణి వర్క్స్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్(డబ్ల్యూపిఎస్ అండ్ జిఎ)ఆధ్వర్యంలో నిర్వహించు వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏరియా జిఎం ఏ మనోహర్ సూచించారు. గురువారం ఏరియాలోని రామకృష్ణాపూర్, సోమగూడెం, బెల్లంపల్లి, మందమర్రి లలో క్రీడా శిబిరాలను గురువారం ఏరియాలోని సింగరేణి ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించిన కోచింగ్ క్యాంపుల ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై, కోచింగ్ క్యాంప్ లను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, వాలీబాల్, బాస్కెట్బాల్, ఫుట్బాల్, అథ్లెటిక్స్ తదితర క్రీడలలో పిల్లలకు సమ్మర్ కోచింగ్ క్యాంప్ ద్వారా శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. క్రీడలతో పిల్లలకు శారీరక దృఢత్వంతో పాటు ఆరోగ్యం, మానసిక ఉల్లాసం కలుగుతుందని తెలిపారు. శిక్షకులకు శిక్షణ ఇచ్చేందుకు అనుభవజ్ఞులైన కోచ్ లను నియమించడం జరిగిందని, ప్రతి ఒక్కరు చక్కగా క్రీడలలో రాణించాలని సూచించారు. 25 రోజులపాటు క్రీడా శిక్షణ శిబిరం నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం శిక్షణకు సంబంధించిన ఆటవస్తువులను కోచ్ లకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి శైలేంద్ర సత్యనారాయణ, సిఎంఓఏఐ ఏరియా అధ్యక్షులు రమేష్, ఏరియా పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్, క్రీడల గౌర కార్యదర్శి ఎం కార్తీక్, క్రీడల సమన్వయకర్త ఏ రవికుమార్, జనరల్ కెప్టెన్ టి చిన్నయ్య, మైదానం ఇంచార్జ్ నస్పూర్ తిరుపతి, పిఈటి లు, పిల్లలు పాల్గొన్నారు.

# బారాస పార్టీలో చేరిన బాన్సువాడ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్

**సీనియర్ నాయకుడు నార్ల రవీందర్ గుప్తా**



టైమ్స్ ఆఫ్ వార్తు- బాన్సువాడ:

మాజీ శాసనసభ సభాపతి, మాజీ మంత్రి, బాన్సువాడ నియోజకవర్గ శాసనసభ్యులు పోచారం శ్రీనివాసరెడ్డి సమక్షంలో బారాస పార్టీలో చేరిన బాన్సువాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, బాన్సువాడ పట్టణ సీనియర్ నాయకులు నార్ల రవీందర్ గుప్తా. గురువారం నార్ల రవీందర్ గుప్తా నివాసంలో గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన పోచారం .నార్ల రవీందర్ గుప్తా అనుచరులకు గులాబీ కండువా కప్పి బారాస పార్టీలోకి ఆహ్వానించిన బారాస పార్టీ బాన్సువాడ నియోజకవర్గ ఇంచార్జీ, మాజీ డిసిసిబి చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి . ఈ కార్యక్రమంలోమున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, కామారెడ్డి జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షుడు డి. అంజిరెడ్డి, సొసైటీ చైర్మన్ ఎర్వల కృష్ణా రెడ్డి, బాన్సువాడ పట్టణ అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్, రూరల్ మండల అధ్యక్షుడు మోహన్ నాయక్, నాయకులు గురువినయ్, ఎజాజ్, నార్ల ఉదయ్, కార్యకర్తలు, తదితరులు, పాల్గొన్నారు.

# ఆరు గ్యారెంటీల అమలులో విఫలం అవుతున్న కాంగ్రెస్

**పసుపు బోర్డు తెస్తానని ఐదేళ్లు పూర్తయినా తేలేని అసమర్ధ బిజెపి**

**కెసిఆర్ ఆశీర్వదించి పంపిన ఎంపీ అభ్యర్థి బాజీ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలి**

**ఎన్నికల ప్రచారంలో నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే బీగాల గణేష్ గుప్తా**

టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ సిటీ



తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీలలో ఆరు గ్యారెంటీలు అమలు పరచడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమవుతుందని, అదేవిధంగా పసుపు బోర్డు తెస్తానని బాండ్ పేపర్ రాసి ఇచ్చిన బిజెపి ఎంపీ అభ్యర్థి ధర్మపురి అరవింద్ ఇప్పటికీ తేలేకపోయాడని నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా అన్నారు. భారత రాష్ట్ర సమితి పార్టీ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గెలుపు కోసం ఇంటింటి ప్రచారంలో నిర్వహించారు. ఇందులో భాగంగా జిల్లా కేంద్రంలోని 50 డివిజన్ అప్నా బజార్ వద్ద నుంచి టిఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ గెలుపు కోసం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశీర్వదించి బాజిరెడ్డి గోవర్ధన్ ను పంపించారని భారీ మెజార్టీతో గెలిపించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కెసిఆర్ ప్రభుత్వంలోనే అనేక సంక్షేమ పథకాలు అందాయని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కల్యాణ లక్ష్మి పెన్షన్లు మూలన పడ్డాయన్నారు. 6 గ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ఫ్రీ బస్ తప్ప చేసింది ఏమీ లేదన్నారు. అదేవిధంగా బిజెపి ఎంపీ అరవింద్ పసుపు బోర్డు పేరు చెప్పి గెలిచి ఐదు సంవత్సరాలు జిల్లాకు ఏమి చేయలేదని మండిపడ్డారు. బిజెపి ప్రభుత్వం అబద్ధాలు చెబుతూ హిందూ, ముస్లింల మధ్య విభేదాలు సృష్టించి ఓట్లు దండుకుంటుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రుణమాఫీ చేస్తానని చెప్పిన రేవంత్ రెడ్డి అధికారంలోకి రాగానే మాట మార్చడం ఏంటని ప్రశ్నించారు. రుణమాఫీ దేవుడు ఎరుక, రైతుబంధు ఇప్పటివరకు ఇవ్వలేదని మండిపడ్డారు. ఒకవైపు నీళ్లు లేక కరెంటు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, పట్టించుకునే నాధుడే కరువాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ దండు నీతూ కిరణ్ శేఖర్, 50 డివిజన్ అధ్యక్షుడు సదానంద్, ప్రభాకర్ రెడ్డి, సిర్ప రాజు, సుజిత్ సింగ్ ఠాకూర్, సత్యప్రకాశ్, సుదాం రవిచందర్ పాల్గొన్నారు.

# మే 4న నిర్వహించే బారాస రోడ్ షో కార్యక్రమం పై సమీక్ష నిర్వహించిన పోచారం భాస్కర్ రెడ్డి

టైమ్స్ ఆఫ్ వార్తు- బాన్సువాడ



బాన్సువాడ నియోజకవర్గం బీర్కూర్ మండల కేంద్రంలో జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మే 4 న బీర్కూర్ మండల కేంద్రంలో మాజీ శాసనసభ సభాపతి, మాజీ మంత్రి, బాన్సువాడ నియోజకవర్గ శాసనసభ్యులుపోచారం శ్రీనివాసరెడ్డి , బారాస పార్టీ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్ కుమార్ అధ్యక్షతన జరగనున్న రోడ్ షో కార్యక్రమాల ఏర్పాట్ల పై బిర్కూర్ మండల ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించి రోడ్ షో కార్యక్రమం విజయవంతం చేయడం గురించి తగు సూచనలు చేసిన బారాస పార్టీ రాష్ట్ర నాయకులు,బాన్సువాడ నియోజక వర్గం బారాస ఇన్చార్జి,ఉమ్మడి నిజామాబాద్ జిల్లా మాజీ డిసిసిబి చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి . ఆయన వెంట బీర్కూరు మండల కేంద్రానికి చెందిన బారాస ప్రజా ప్రతినిధులు, నాయకులు ,కార్యకర్తలు,ఉన్నారు.

# 2014 కటాఫ్ డేట్ తొలగిస్తాం

**బీడీ కార్మికులకు వైద్య సదుపాయాలు కల్పిస్తాం**

**కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి తాటిపర్తి జీవన్ రెడ్డి**

టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ సిటీ



బీడీ కార్మికులకు ప్రభుత్వం విధించిన 2014 కట్ ఆఫ్ ను తొలగించడంతోపాటు వారికి వైద్య సదుపాయాలు కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి తాటిపర్తి జీవన్ రెడ్డి అన్నారు. నిజామాబాద్ పట్టణంలోని ప్రగతి నగర్ మున్నూర్ కాపు సంఘ భవనంలో బీడి కార్మికులకు కాంగ్రెస్ పార్టీ భరోసా సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. అదేవిధంగా ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, గడుగు గంగాధర్, కేశ వేణు, కర్నాకర్, వివిధ హోదాలో ఉన్న నాయకులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. అనంతరంజీవన్ రెడ్డి మాట్లాడుతూ.. బీడీ పరిశ్రమ బలోపేతం కావాలని, 2014 కటఫ్ డేట్ తొలగిస్తామని దాంతోపాటు హాస్పిటల్ లో వైద్య సదుపాయాలు కలిపిస్తాం అన్నారు. ఆడబిడ్డకు ఆత్మ స్థైర్యాన్ని నింపి అండగా ఉండే పార్టీ కాంగ్రెస్ పార్టీ అన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాలు కానీ ఇతర రాష్ట్రాలలో కానీ బీడి కార్మికులకు పింఛన్ లేదన్నారు. కానీ గత ప్రభుత్వం 2014 కటఫ్ డేట్ పెట్టడంతో చాలా మందికి బీడీ పెంక్షన్ రావడం లేదని, రాబోయే రోజుల్లో ఎలాంటి కటఫ్ డేట్ లేకుండా 2000తో పాటు మరో 2000 కలిపి 4000 రూపాయలు బీడీ పింక్షన్ ఇవ్వబోయే పార్టీ కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. బీడీ కార్మికులకు నెలకు 1000 బీడీలు చేస్తే 230 రూపాయలు వస్తున్నాయని, 1000 బీడీలు ఎవరు చేయడం లేదు కనీసం 300 రూపాయల వేతనం చెల్లింపు చేసే విదంగా కృషి చేస్తా అన్నారు. వైద్య సదుపాయం ఈఎస్ఐ హాస్పిటల్ విస్తరణ లేదని, ఆడబిడ్డ ప్రసూతి డెలివరీ కొరకు ప్రావిడెంట్ ఫండ్ శాఖ ద్వారా ప్రసూతికి ఒక లక్ష రూపాయలు ఖర్చు చేయాలని, బీడీ పరిశ్రమపై వేలకోట్ల ఆదాయాన్ని సమకూర్చుకుంటుందని, కేంద్ర ప్రభుత్వం బీడీ కార్మికుల కుటుంబాలకు ఎందుకు సహాయం చేయడం లేదని ఆయన నిలదీశారు. విద్య అనేది ప్రధానం అని, బీడీ పరిశ్రమపై ఆధారపడ్డ ఆడబిడ్డల పిల్లలకు విద్య, వైద్య సదుపాయాలు సమకూర్చాలన్నారు. చేసినా చేయకపోయినా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది, రేపు బీడీ కార్మికులకు అండగా నిలిచే ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి తనను గెలిపించాలని కోరుతూ మీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాను అని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, బీడీ కార్మికులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎంపీఅభ్యర్థి గాలి అనిల్ కుమార్ కు మద్దతుగా

**బోర్లం ఎస్సీ కాలనీ లో ప్రచారం ప్రారంభించిన బి ఆర్ ఎస్ నాయకులు**

టైమ్స్ ఆఫ్ వార్తు- బాన్సువాడ:



బాన్సువాడ గ్రామీణ మండలం బోర్లం గ్రామంలో బాన్స్ వాడ శాసనసభ్యులు పోచారం శ్రీనివాస్ రెడ్డి,బాన్స్ వాడ బి ఆర్ ఎస్ నియోజకవర్గం ఇంచార్జ్ పోచారం భాస్కర్ రెడ్డి ఆదేశాలమేరకు జాహిరాబాద్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్ కుమార్ కు కారు గుర్తు కు ఓటు వేసి గెలిపించాలని బోర్లం గ్రామ ఎస్సీ కాలనీ లో గురువారం గడప గడపకు తిరుగుతూ ప్రచారం ప్రారంభించిన బోర్లం గ్రామ బి ఆర్ యస్ నాయకులు, మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ ఆధ్వర్యంలో ఎంపీ లను గెలిపించి తెలంగాణ కు జరిగే అన్యాయలను పార్లమెంట్ లో నిలదీసే అవకాశం కలిపించాలని గ్రామ ప్రజలను బాన్స్ వాడ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింలు, బోర్లం బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు గోపన్ పల్లి సాయిలు రెడ్డి, సంగం అధ్యక్షులు పెద్ద పెట్లోళ్ల పర్వం రెడ్డి, మండల బి ఆర్ ఎస్ ప్రధాన కార్యదర్శి టి రాజేశ్వర్ గౌడ్ లు కోరారు. ఈ కార్యక్రమం లో బోర్లం బి ఆర్ ఎస్ గ్రామ రైతు విభాగం అధ్యక్షులు కే .విద్యాసాగర్ రెడ్డి, మండల మైనారిటీ సెల్ అధ్యక్షులు సయ్యద్ జలీల్ ,బోర్లం గ్రామ నాయకులు మన్నె చిన్న సాయిలు, సింగరి సంతోష్, పూజం జీవన్ , తదితరులు, పాల్గొన్నారు.

# నియోజకవర్గాలకు బ్యాలెట్ యూనిట్ల తరలింపు

**పర్యవేక్షించిన కలెక్టర్, అదనపు కలెక్టర్**

టైమ్స్ అఫ్ వార్త - నిజామాబాద్ కలెక్టరేట్



పార్లమెంటు ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా కట్టుదిట్టమైన భద్రత నడుమ గురువారం జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోడౌన్ నుంచి నిజామాబాద్ పార్లమెంటు సెగ్మెంట్ పరిధిలోని ఆయా అసెంబ్లీ నియోజకవర్గాలకు అదనపు బ్యాలెట్ యూనిట్లు తరలించారు. రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ ల పర్యవేక్షణలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పకడ్బందీ ఏర్పాట్ల నడుమ తరలింపు ప్రక్రియ నిర్వహించారు. అంతకుముందు ఈసీఐఎల్ ఇంజినీర్ల బృందంచే బ్యాలెట్ యూనిట్ల ప్రాథమిక పరిశీలన (ఎఫ్.ఎల్.సి) ప్రక్రియ జరిపించారు. అనుబంధ ర్యాండమైజేషన్ చేపట్టి, ఆ జాబితాను అనుసరిస్తూ అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాలకు బ్యాలెట్ యూనిట్లను తరలించారు. ఎలాంటి లోటుపాట్లు, గందరగోళానికి తావులేకుండా ఈ.సీ సూచనలకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా తరలింపు జరిగేలా కలెక్టర్, అదనపు కలెక్టర్ పకడ్బందీ పర్యవేక్షణ జరిపారు. కలెక్టర్ వెంట ట్రైనీ కలెక్టర్ సాకేత్, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్, సాత్విక్ తదితరులు ఉన్నారు.

జనరల్ న్యూస్
GENERAL NEWS
టైమ్స్ ఆఫ్ వార్త
తెలుగు దినపత్రిక
శుక్రవారం,
03-05-2024



# నేటి నుంచి నాలుగు రోజుల పాటు హోమ్ ఓటింగ్

### రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు



టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ కలెక్టరేట్

ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా నిజామాబాద్ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో ఈ నెల 3, 4, 5, 6 తేదీలలో హోమ్ ఓటింగ్ నిర్వహించేలా అవసరమైన ఏర్పాట్లు చేశామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. పార్లమెంటు సెగ్మెంట్ లోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మొత్తం 1758 మంది ఓట్ ఫ్రమ్ హోమ్ సదుపాయాన్ని వినియోగించుకోనున్నారని వివరించారు. వీరిలో 85 సంవత్సరాలకు పైబడిన సీనియర్ సిటిజన్ ఓటర్లు 859 మంది ఉండగా, దివ్యాంగ ఓటర్లు 899 మంది ఉన్నారని అన్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా చూస్తే, ఆర్మూర్ అసెంబ్లీ సెగ్మెంట్లో 181 మంది సీనియర్ సిటిజన్ ఓటర్లు, 209 మంది దివ్యంగ ఓటర్లు తమతమ ఇళ్ల వద్ద నుంచే ఓటు హక్కు వినియోగించుకోనున్నారని తెలిపారు. అలాగే, బోధన్ అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో సీనియర్ సిటిజన్ ఓటర్లు 123 మంది, దివ్యంగ ఓటర్లు 111 మంది, నిజామాబాద్ అర్బన్ సెగ్మెంట్ పరిధిలో సీనియర్ సిటిజన్ ఓటర్లు 33 మంది, దివ్యంగ ఓటర్లు 26 మంది, నిజామాబాద్ రూరల్ సెగ్మెంట్ పరిధిలో సీనియర్ సిటిజన్ ఓటర్లు 109 మంది, దివ్యంగ ఓటర్లు 183 మంది, బాల్కొండ నియోజకవర్గం పరిధిలో సీనియర్ సిటిజన్ ఓటర్లు 97 మంది, దివ్యంగ ఓటర్లు 96 మంది, కోరుట్ల అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో సీనియర్ సిటిజన్ ఓటర్లు 84 మంది, దివ్యంగ ఓటర్లు 132 మంది, జగిత్యాల అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో సీనియర్ సిటిజన్ ఓటర్లు 232 మంది, దివ్యంగ ఓటర్లు 142 మంది ఇంటి వద్దనే ఓటు హక్కును వినియోగించుకోనున్నారని వివరించారు. ఈ మేరకు ప్రత్యేకంగా 50 హోమ్ ఓటింగ్ బృందాలను ఏర్పాటు చేసి, ఓటు సేకరణ ప్రక్రియపై వారికి శిక్షణ అందించడం జరిగిందన్నారు. ఒక్కో బృందంలో పీ.ఓ, ఓపీఓ, మైక్రో అబ్జర్వర్ తో పాటు వీడియో గ్రాఫర్, పోలీస్ సిబ్బంది ఉంటారని అన్నారు. ఎలక్షన్ కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా పూర్తి గోప్యతను పాటిస్తూ, పారదర్శకంగా హోమ్ ఓటింగ్ ప్రక్రియను నిర్వహించేలా పకడ్బందీ చర్యలు తీసుకున్నామని, ఈ ప్రక్రియ మొత్తాన్ని వీడియోగ్రఫీ చేయిస్తున్నామని తెలిపారు. నియోజకవర్గం పరిధిలో కొనసాగే హోమ్ ఓటింగ్ కు సంబందించిన పూర్తి సమాచారాన్నిఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులతో పాటు రాజకీయ పార్టీలకు ముందస్తుగానే చేరవేశామని, హోమ్ ఓటింగ్ ప్రక్రియను వారు కూడా పరిశీలించవచ్చని కలెక్టర్ సూచించారు. హోమ్ ఓటింగ్ కోసం దరఖాస్తు చేసుకుని అర్హత పొందిన ఓటర్లు వారికి సూచించబడిన తేదీలలో ఇంటి వద్ద అందుబాటులో ఉంటూ, ఓటు హక్కును వినియోగించుకోవాలని, హోమ్ ఓటింగ్ కోసం ఇంటి వద్దకు వచ్చే బృందాలకు సహకరించాలని కోరారు. కాగా, ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న అత్యవసర విభాగాలకు చెందిన మరో 86 మంది సైతం పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని వినియోగించుకునేందుకు వీలుగా అవసరమైన ఏర్పాట్లు చేశామని కలెక్టర్ తెలిపారు.

## యూనివర్సిటీ హాస్టల్స్ లను యధావిధిగా కొనసాగించాలి

### విద్యార్థుల నుంచి ఎటువంటి మెస్ చార్జీలు వసూలు చేయవద్దు

### పి.డి.ఎస్.యూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్



టైమ్స్ అఫ్ వార్త - నిజామాబాద్ సిటీ

తెలంగాణ యూనివర్సిటీ హాస్టల్స్ ను యదావిధిగా కొనసాగించడం తోపాటు విద్యార్థుల నుంచి ఎటువంటి మెస్ ఛార్జీలు తీసుకోవద్దని పి.డి.ఎస్.యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ యూనివర్సిటీ అధికారులను డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా పి.డి.ఎస్.యూ ఆధ్వర్యంలో తెలంగాణ విశ్వవిద్యాలయంలో విలేకరుల విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సమావేశాన్ని ఉద్దేశించి రాజేశ్వర్ మాట్లాడుతూ యూనివర్సిటీలో చదువుకునే విద్యార్థులకు పోటీ పరీక్షలు,ఇతర పరీక్షలు దగ్గర ఉన్నాయని కావున దానికి సంబంధించిన పరీక్షలకు సిద్ధపడేందుకు సమయం తక్కువ ఉన్నదని, కావున యూనివర్సిటీలో వసతి యధావిధిగా కల్పించాలని,అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని,యూనివర్సిటీలో చదువు కున్న విద్యార్థులు దాదాపు సామాన్య మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వారి కావున వాళ్ళ దగ్గర ఎటువంటి మెస్ బిల్స్ తీసుకోవద్దన్నారు. అదేవిధంగా విద్యార్థులకు అన్ని రకాల త్రాగు నీటి, పుస్తకాలు,విద్యుత్తు సౌకర్యాలను అందుబాటులో ఉంచాలని కోరారు.ఈ కార్య క్రమంలో పి.డి.ఎస్.యూ నాయకులు ప్రిన్స్,దేవిక,శివ సాయి,రాజు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీకి బాన్సువాడ కిరాణా అసోసియేషన్ నాయకుల మద్దతు



టైమ్స్ ఆఫ్ వార్తు- బాన్సువాడ:

ఈనెల 13న నిర్వహించే పార్లమెంట్ ఎన్నికల పోలింగ్లో కాంగ్రెస్ పార్టీకి అండగా ఉంటామని తెలుపుతూ బాన్సువాడ పట్టణ కిరాణం అసోసియేషన్ అధ్యక్షుడు కొండ రాజులు వారి కార్యవర్గం సభ్యులతో కలిసి గురువారం బాన్సువాడ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ,మాజీ ఎమ్మెల్యే, ఏనుగు రవీందర్ రెడ్డి ని కలిసి తమ సంపూర్ణ మద్దతును సంఘీభావాన్ని ప్రకటించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో తమకు అండగా నిలబడతావని స్పష్టమైన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రతాప్ సింగ్ తో పాటు కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, బాన్సువాడ కిరాణ అసోసియేషన్ కార్యవర్గ ప్రతినిధులు, తదితరులు, పాల్గొన్నారు.

## పెరిగిన ధరలకు అనుగుణంగా వేతన ఒప్పందం చేసే అమలు చేయాలి

### తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ (ఐ.ఎఫ్.టి.యు) వనమాల కృష్ణ



టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ సిటీ

బీడీ కార్మికులందరికీ పెరిగిన ధరలకు అనుగుణంగా వేతన ఒప్పందం చేసి, అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ (ఐ.ఎఫ్.టి.యు) ఆధ్వర్యంలో బీడీ కంపెనీ యజమానుల సంఘం అధ్యక్షుడు హెచ్.పీ ప్రకాష్ ఉపాధ్యాయ, ప్రధాన కార్యదర్శి ధర్మేందర్ గాంధీలను డిమాండ్ నోటీసు ఇచ్చారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ (ఐ.ఎఫ్.టీ.యు) రాష్ట్ర అధ్యక్షులు వనమాల కృష్ణ మాట్లాడుతూ 30 ఏప్రిల్ 2024 వరకు వేతన ఒప్పందం ముగిసిందన్నారు. వెంటనే వేతన ఒప్పందం చేసి 1 మే 2024 నుంచి అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీడీ కార్మికులకు వేయి బీడీలకు 400 రూపాయలు ఇవ్వాలన్నారు. నెలసరి జీతాల ఉద్యోగులైన బీడీ ప్యాకర్లు, సార్టర్, ఆకు, తంబాకు పంచేవారు, గుమస్తాలకు, అకౌంటెంట్లకు, బట్టీవాల, చెన్నీవాల, గంపవాల, వాచ్ మెన్ లకు ప్రస్తుత వేతనంపై 50 శాతం పెంచాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం కరువు భత్యం వి డి ఏ రేటు పాయింట్ కు పది పైసల నుంచి 30 పైసలకు పెంచాలని డిమాండ్ చేశారు. బీడి పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులకు అనేక సమస్యలు ఉన్నాయని వాటన్నింటినీ సామరస్యంగా చర్చించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళనలకు పూనుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. నరేందర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కే. రాజన్న, నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు డి. రాజేశ్వర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. వెంకన్న, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు రాంప్రసాద్ పాల్గొన్నారు.

## వినియోగదారులకు మెరుగైన విద్యుత్ ను అందించాలి



టైమ్స్ ఆఫ్ వార్త-బిక్కనూర్

కామారెడ్డి జిల్లా విద్యుత్ శాఖ సూపరిండెంట్ ఇంజనీరింగ్ ఎం రమేష్ బాబు ఈరోజు 33/11 కెవి సబ్ స్టేషన్ జంగంపల్లి, బస్వాపూర్, భిక్కనూరు ను తనిఖీ చేయడం జరిగింది. బస్వాపూర్ గ్రామానికి అంతరాయాలు తగ్గించడానికి నూతనంగా ఏర్పాటు చేసిన 11 కె.వి బస్వాపూర్ టౌన్ ఫీడర్ ను పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా విద్యుత్ అంతరాయాలు లేకుండా చేసినందుకు సిబ్బందిని అభినందించడం జరిగింది. వ్యవసాయ విద్యుత్తును సరఫరా చేసే ఫీడర్లపైన అంతరాయాలు ఎలా ఉన్నాయో సిబ్బందిని అడిగి తెలుసుకోవడం జరిగింది. వేసవి దృష్టిలో ఉంచుకొని అప్రమత్తంగా ఉండాలని, నిత్యం విద్యుత్తు లైన్లను తనిఖీ చేస్తూ అంతరాయం లేకుండా విద్యుత్తు వినియోగదారులకు అందించాలని విద్యుత్ వలన ఎలాంటి సమస్యలను రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించడం జరిగింది. విద్యుత్ సిబ్బంది స్థానికంగా అందుబాటులో ఉండాలని ఆదేశించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ కిరణ్, బిక్కనూర్ ఏఈ రామలక్ష్మి, సబ్ ఇంజనీర్ శివతేజ, సిబ్బంది పాల్గొనడం జరిగింది.

## ఆ ఇద్దరు రబ్బరు స్టాంపులు మనకు అవసరం లేదు

### జడ్పీ చైర్మన్ విట్టల్ రావు...





టైమ్స్ ఆఫ్ వార్త - ఎడపల్లి

బీజేపీ పార్టీ ఎంపీ అభ్యర్థి ధర్మపురి అరవింద్, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జీవన్ రెడ్డిలు ఇద్దరూ రబ్బరు స్టాంపులే అని ఆఇద్దరు రబ్బరు స్టాంపులు మనకు అవసరం లేదని జడ్పీ చైర్మన్ దాదన్నగారి విట్టల్ రావు పేర్కొన్నారు. బిఆరెస్ సాగు నీరు ఇస్తే... కాంగ్రెసోళ్లు కన్నీళ్లు ఇస్తున్నారని ఆయన అన్నారు.. ఈమేరకు బిఆరెస్ పార్టీ లోక్ సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా బిఆరెస్ కార్యకర్తల సమావేశం, ప్రచార కార్యక్రమం గురువారం జానకంపేట్ లోని ఓఫంక్షన్ హాల్లో నిర్వహించారు.ఈ మేరకు బోధన్ ఎమ్మెల్యే షకీల్ సతీమణి అయేషా ఫాతిమా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం ఏయార్పిక్యాంపు, ఎడపల్లి తో పాటు ఆమె బిఆరెస్ కార్యకర్తల సమావేశం,నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 420హామీలు మొత్తం కూడా అబద్ధాలే అని వాటిని అమలు చేయలేని పరిస్థితిలో కాంగ్రెస్ పార్టీ ఉందని అన్నారు.బీజేపీ హిందూ, ముస్లింలను విడదీస్తుందని అన్నారు. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన బాజిరెడ్డి గోవర్ధన్ ఎక్కడ నిలబడ్డా గెలిచే సత్తా ఉన్నాడని అన్నారు. అబద్ధపు హామీలతో కాంగ్రెస్ పార్టీ గెలిచిందని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన420 హామీలు ఏవీ అమలయ్యే పరిస్థితి లేదన్నారు. ఎంపీ అరవింద్ తో ఒప్పందం చేసుకొని అడ్డదారిలో సుదర్శన్ రెడ్డి గెలిచాడని అన్నారు. బిఆరెస్ కార్యకర్తలపై దాడులు జరుగుతున్నాయని కార్యకర్తలు అధైర్యపడవద్దని కార్యకర్తలను కడుపులో పెట్టుకొని కాపాడుకొనేందుకు కేసీఆర్10 కోట్ల నిధిని ఏర్పాటు చేశారన్నారు. మాజీ ఎమ్మెల్యే షకీల్ ను ఎదిరించలేక తమ కొడుకుపై కేసులు పెట్టిస్తున్నారని అయేషా ఫాతిమా అన్నారు. రేవంత్ రెడ్డి మాయమాటలు నమ్మి కాంగ్రెస్ కు ఓటు వేశారని, తాము పనిచేసి ఓడిపోయామన్నారు. కాంగ్రెస్ పార్టీ వస్తే మార్పు కనిపిస్తుందని చెప్పారని భగీరథ నీళ్లు, కరెంట్ బంద్ చేసి కాంగ్రెసోళ్లు మార్పు తెచ్చారని ఎద్దేవాచేశారు. ఒక్కొక్కరు బిఆరెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ కు 100 ఓట్లు వేయించాలని, ఇక రెండోసారి మోసపోవడాని బోధన్ నియోజకవర్గ ప్రజలు సిద్ధంగా లేరని అన్నారు. ఇక ఎంపీ అరవింద్ విషయానికి వస్తే పసుపు బోర్డు 5 రోజుల్లో తెస్తానని, ఎన్ఎస్ఎఫ్ ఫ్యాక్టరీలను తెరిపిస్తానని చెప్పిన అరవింద్ కు ఇంకా 5రోజులు కాలేదా అని ప్రశ్నించారు.పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఉన్న జీవన్ రెడ్డి జిల్లాలో ఏ ఒక్కరోజైన తిరిగాడా,ఎక్కడైనా నిధులు ఇచ్చాడా? లేదే అలాంటి జీవన్ రెడ్డికి ఎందుకు ఓటయ్యాలని అన్నారు. దేశంలో కాంగ్రెస్ పార్టీ చాలా వీక్ గా ఉందని, బీజేపీని ఓడించేది కేవలం బిఆరెస్ పార్టీతోనే సాధ్యమని కాంగ్రెస్ మూడొస్తానంలోకి వెళుతుందని చెప్పారు. ప్రజలకోసం పోరాడే వాళ్లకు ఓటేయ్యాలని, అది కేవలం బిఆరెస్ పార్టీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ తోనే సాధ్యమన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాస్, బిఆరెస్ పార్టీ ఎడపల్లి మండల అధ్యక్షుడు శ్రీరాం, వైస్ ఎంపీపీ ఇమ్రాన్, ఎంపిటిసిలు వనజ నాగరాజ్,గుంజరి మనీషా రెడ్డి, పద్మ ముత్తెన్న, ఆకుల శ్రీనివాస్,గైని పోచయ్య, శేఖర్ రాజ్, మల్కాస్వామి, ఆసిఫ్, నాయకులు, కార్యకర్తలు, బూతు అధ్యక్షులు,తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి అధికారంలోకి వస్తే మైనారిటీలకు ఇబ్బందులు తప్పవు

### కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాలకు సమన్యాయం

### ప్రభుత్వ సలహాదారుడు మహమ్మద్ అలీ షబ్బీర్



టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ సిటీ

కేంద్రంలో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వస్తే మైనారిటీ వర్గాలకు ఇబ్బందులు తప్పవని ప్రభుత్వ సలహాదారుడు మొహమ్మద్ అలీ షబ్బీర్ అన్నారు. నిజామాబాదు నగరంలోని సిఎస్ఐ చర్చిలో ప్రాంగణంలో గల సండే స్కూల్ బిల్డింగ్ లో తెలంగాణ యునైటెడ్ పాస్టర్స్ అసోసియేషన్ మీటింగులో నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థి ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ తో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ తోనే మైనార్టీలకు భద్రత, బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు రద్దు చేసి మైనార్టీలను ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే అన్ని కులాలకు సమన్యాయం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. కలిసికట్టుగా కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలిపి నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థి జీవన్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. మైనారిటీ విభాగం ఇంచార్జ్ థామస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సిఎస్ఐ చర్చ్ ఫాదర్ రెవరెండ్ జార్జ్, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, నిజామాబాద్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, గడుగు గంగాధర్, మాజీ ఎమ్మెల్సీ డి. రాజేశ్వర్ రావు, యునైటెడ్ పాస్టర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## పదిలో ప్రతిభ కనబరిచిన శ్రీ చైతన్య ఖల్సా బ్రాంచ్ విద్యార్థులు



టైమ్స్ ఆఫ్ వార్త - ఎల్బీనగర్ ప్రతినిధి:

విద్యనభ్యసించే విద్యార్థులకు పాఠశాల పదవ తరగతి జీవితంలో మొదటి మెట్టు లాంటిదని పాఠశాల విద్యాభ్యాసం ముగిసిన అనంతరం పై చదువుల కోసం కళాశాలలో చేరి మరింత కష్టపడి విద్యను అభ్యసించి మరో మెట్టు అధిగమించాలని శ్రీ చైతన్య విద్యాసంస్థల ఏజీఎం సతీష్ అన్నారు. 2023-2024 విద్యా సంవత్సరం పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో హయత్ నగర్ ఖల్సా బ్రాంచ్ శ్రీ చైతన్య విద్యార్థులు అత్యద్భుత ప్రతిభ కనబరిచి మెరుగైన ఫలితాలు సాధించిన సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సతీష్ పాల్గొని విద్యార్థులను అభినందించారు. శ్రీ చైతన్య విద్యా సంస్థలో విద్యనభ్యసించిన ప్రతి విద్యార్థి ఈ విజయ పరంపరను భవిష్యత్తులో కూడా కొనసాగించి మంచి పేరు తీసుకురావాలని ఆయన సూచించారు. కష్టపడి చదువుకొనే తత్వాన్ని అలవర్చుకోవాలని,విద్యార్థి దశలో కష్టపడితే భవిష్యత్తు బంగారుమయం అవుతుందని ఆయన తెలిపారు. అందుకోసం ప్రతి విద్యార్థి సరైన ప్రణాళికలు రూపొందించుకొని ఆ దిశగా ముందుకు వెళ్లాలన్నారు. మొత్తం విద్యార్థుల్లో 11 మంది10 మరియు 9.8 జీపీఏ సాధించగా 9 జి పి ఏ పైన ప్రతిభను కనబరిచిన వారు 35 మంది, కాగా తెలుగు హిందీ సోషల్ ఇతర సబ్జెక్టుల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.ఈ సందర్భంగా విద్యార్థులను విద్యలో ప్రోత్సహించేలా మోడల్స్ అందజేసి వెన్ను తట్టారు.ఈ కార్యక్రమంలో హయత్ నగర్ శ్రీ చైతన్య పాఠశాల ఖల్సా బ్రాంచ్ ప్రిన్సిపాల్ జంజనం.కిరణ్మయి, ఆర్ ఐ వెంకట్ రెడ్డి, కోఆర్డినేటర్స్ రవి,జితేందర్,డిన్ మోహన్, ఇన్ చార్జి మోహన్,ఏవో శేఖర్ శ్రీ చైతన్య పాఠశాల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

జనరల్ న్యూస్
GENERAL NEWS

టైమ్స్ ఆఫ్ వార్త
తెలుగు దినపత్రిక

శుక్రవారం,
03-05-2024



# ఆర్ఎంపీ శ్రీనివాస్‌పై సుమోటోగా కేసు నమోదు

**తెలంగాణ రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ లీగల్ అండ్ ఆంటీక్వాకరీ చర్యలు**

**బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ**

**ఇంకా పరారీలోనే ఆర్ఎంపీ శ్రీనివాస్**

టైమ్స్‌ఆఫ్ వార్త-వరంగల్ జిల్లా:





వరంగల్ జిల్లా వర్ధన్నపేట పట్టణ కేంద్రంలో కత్తి నవీన్ అనే యువకుని మృతికి కారణమైన ఆర్ఎంపీ శ్రీనివాస్ పై తెలంగాణ రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ చర్యలు చేపట్టింది. నవీన్ కు నిర్లక్ష్యపూరిత వైద్యం అందించిన శ్రీనివాస్ నిర్వాకంపై సుమోటోగా కేసు నమోదు చేసింది. గురువారం తెలంగాణ రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ లీగల్ అండ్ ఆంటీక్వాకరీ టీమ్ వర్ధన్నపేట పట్టణానికి వచ్చింది. డాక్టర్ శేషుమాధవ్ నేతృత్వంలోని బృందం వర్ధన్నపేట ఫిరంగిగడ్డలోని ఆర్ఎంపీ శ్రీనివాస్ కు చెందిన లక్ష్మి క్లినిక్ కు వచ్చింది. ఐతే, క్లినిక్ మూసేసి ఉండడంతో టీమ్ సభ్యులు చుట్టుపక్కల ప్రజలతో మాట్లాడారు. అనంతరం నవీన్ కుటుంబసభ్యులను పరామర్శించారు. నవీన్ మృతికి దారి తీసిన పరిస్థితులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని, బాధ్యులపై కఠిన చర్యలు తీసు కునేలా చేసి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడిన డాక్టర్ శేషుమాధవ్, ఆర్ఎంపీలు ఇష్టం వచ్చినట్లుగా ట్రీట్మెంట్ చేయవద్దని సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే ఆర్ఎంపీలు, డాక్టర్లపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇదిలా ఉంటే, నవీన్ మృతికి కారణమైన ఆర్ఎంపీ శ్రీనివాస్ ఇంకా పరారీలో ఉన్నాడు. శ్రీనివాస్ ఆచూకీ కనుక్కోవడానికి అన్ని విధాలుగా ప్రయ త్నిస్తున్నామని పోలీసులు తెలిపారు.

## ఘనంగా వడ్డేపల్లి ఆత్మలింగేశ్వర ఆలయం 12వ వార్షికోత్సవ వేడుకలు..

టైమ్స్ ఆఫ్ వార్త - ఎడపల్లి





ఎడపల్లి మండలంలోని వడ్డేపల్లి గ్రామ శివారులోని హనుమత్ సమేత ఆత్మ లింగేశ్వరస్వామి ఆలయం12వ వార్షికోత్సవ వేడుకలను గురువారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో ఆలయం నిర్వాహకులు,గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఇందులో భాగంగా హాజరైన పిట్ల కృష్ణ మహారాజ్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో ఉదయం గణపతి గౌరీ వచనం, ద్వాజరోహనం, ముఖ్యదేవత స్థాపన, మహారుద్ర అభిషేకం,రుద్రాహోమం,అగ్ని ప్రతిష్ట,నవగ్రహ హోమము, రుద్రాభి షేకం,108 మంది జంటలతో యజ్ఞం నిర్వహించారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రాజు, కూరెళ్ల శ్రీధర్,రాజేందర్, ప్రసాద్,అరుణ్, ఆంజనేయులు,ఆనంద్, సందీప్, భూమయ్య,వేణు, గోవింద్, యాదగిరి,కళ్యాణ్, గ్రామస్తులు, చుట్టూపక్కల గ్రామాల నుండి అధికసంఖ్యలో భక్తులు, పాల్గొన్నారు.

## 4న చిగురింతలు పుస్తకావిష్కరణ

టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ కల్చరల్




ఇందూరు జిల్లా బాలసాహిత్యవేదిక ఆధ్వర్యంలో ప్రముఖ కవి, చిత్రకారుడు చింతల శ్రీనివాస గుప్త రచించిన బాలగేయాల సంపుటి "చిగురింతలు" పుస్తక ఆవిష్కరణ సభ ఈనెల 4వ తేదీన నగరంలోని హరిచరణ్ మార్వాడి పాఠశాల సమావేశ మందిరంలో జరుగనున్నట్లు వేదిక అధ్యక్షుడు డాక్టర్ కాసర్ల నరేశ్ రావు తెలిపారు. ప్రముఖ బాలసాహితీవేత్తలు డాక్టర్ వి. ఆర్. శర్మ, డాక్టర్ అమృత లత, తల్లావజల మహేశ్ బాబు అతిథులుగా పాల్గొననున్న ఈసభకు బాలసాహిత్యాభిమానులందరూ తరలి రావాలని డాక్టర్ కాసర్ల కోరారు. ఈ విలేఖరుల సమావేశంలో ఇందూరు జిల్లా బాలసాహిత్యవేదిక ఉపాధ్యక్షుడు గంట్యాల ప్రసాద్, కార్యదర్శి డాక్టర్ శారద, కోశాధికారి, పుస్తక రచయిత చింతల శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఏనుగు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన మాజీ ఉప సర్పంచ్

టైమ్స్ ఆఫ్ వార్త - బాన్సువాడ:



బాన్సువాడ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బాన్సువాడ పట్టణ మాజీ ఉపసర్పంచ్ కమ్రుద్దీన్ గురువారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి సమక్షంలో పార్టీలో చేరేగా ఆయనకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రతాప్ సింగ్, నాయకులు కొత్తకొండ భాస్కర్, నార్ల రఘు, తదితరులు, పాల్గొన్నారు.

## ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి..

**పార్టీ ఇంచార్జ్ ఏనుగు రవీందర్ రెడ్డి**



టైమ్స్ ఆఫ్ వార్త - బాన్సువాడ:

బాన్సువాడ నియోజకవర్గం మోసరా మండల కేంద్రంలో ఆయా గ్రామాల్లో బూత్ ఏజెంట్లతో కలిసి గురువారం బాన్సువాడ నియోజకవర్గం పార్టీ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే, ఏనుగు రవీందర్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశానికి సీనియర్ నాయకులు తహర్ బిన్ హందన్ విచ్చేసి మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో నాయకులు కార్యకర్తలు కలిసి పనిచేసి ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కర్ ను గెలిపించాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు, పాల్గొన్నారు.

## మాజీ మేయర్ నివాస గృహంలో జీవన్ రెడ్డికి తేనెటి విందు, అల్పాహారం

టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ సిటీ



మాజీ మేయర్ ఆకుల సుజాత శ్రీశైలం నివాస గృహంలో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి తాటిపర్తి జీవన్ రెడ్డికి తేనేటి విందు, అల్పాహారం ఏర్పాటు చేశారు. పార్లమెంటు ఎన్నికల్లో భాగంగా నిజామాబాద్ నగరంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయనను మాజీ మేయర్ ఆకుల సుజాత శ్రీశైలం అల్పాహార ఎందుకు ఆహ్వానించారు. వారిచ్చిన ఆతిథ్యానికి ఆయన తజ్ఞతలు తెలిపారు. ఆయనతోపాటు కాంగ్రెస్ పార్టీ ఎంఎల్సి మహేష్ కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహా దారులు మమ్మద్ షబ్బీర్ అలీ, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహర్బిన్ హందాన్, నగర అధ్యక్షుడు కేశవ వేణు, గడుగు గంగాధర్, నరాల రత్నాకర్, బాస్సీ శేఖర్ గౌడ్, అంత రెడ్డి రాజి రెడ్డి, ముప్పగంగా రెడ్డి గారు జావిద్ అక్రమ్, భక్తవత్సలం, ఆకుల శ్రీశైలం, కార్పొరేటర్లు మాజీ కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

## లక్ష రూపాయల నగదును పట్టుకున్న పోలీసులు

టైమ్స్ ఆఫ్ వార్త - బాన్సువాడ:

బాన్సువాడ పట్టణంలోని రాజీవ్ గాంధీ చౌరస్తాలో గురువారం పోలీసులు వాహనాలు తనిఖీ చేయగా హేమ్లా నాయక్ తండాకు చెందిన పూల్ సింగ్ వద్ద లక్ష రూపాయల నగదు కు సంబంధించిన ధ్రువ పాత్ర లు లేకపోవడంతో జప్తు చేసినట్లు పట్టణ సీఐ కృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐ కృష్ణతోపాటు పోలీస్ సిబ్బంది, ఎన్నికల అధికారులు, పాల్గొన్నారు.



## ఎంపీ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం నిర్వహించిన నాయకులు



టైమ్స్ ఆఫ్ వార్త - బాన్సువాడ

బాన్సువాడ మండలంలోని ఇబ్రహీంపేట్ గ్రామంలో గురువారం పార్లమెంట్ అభ్యర్థి సురేష్ షెట్కర్ కు మద్దతుగా కాంగ్రెస్ నాయకులు ఉపాధి కూలీల వద్దకు వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మంత్రి గణేష్, నాయకులు ఉద్దెర హనుమాన్లు, వెంకట్ రెడ్డి, బండి సాయిలు యాదవ్, శంభు లింగం, సాయిలు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు ,పాల్గొన్నారు.

# పార్లమెంట్ ఎన్నికల పోలింగ్‌కు గంట సమయం పొడిగింపు

**ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటలకు బదులుగా 6 గంటల వరకు పెంపు**

**పెరిగిన పోలింగ్ సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి**

**రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు**

టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ కలెక్టరేట్



వేసవి తీవ్రత, పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ తక్కువగా నమోదు కావడం వంటి అంశాలను దృష్టిలో పెట్టుకుని, వివిధ వర్గాల వారి అభ్యర్థన మేరకు ప్రస్తుత పార్లమెంటు ఎన్నికల్లో పోలింగ్ సమయాన్ని ఒక గంట పెంచుతూ కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసిందని నిజామాబాద్ పార్లమెంటు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. ఈ నెల 13న జరుగనున్న పోలింగ్ సందర్భంగా పెంచిన సమయం అందుబాటులో ఉంటుందని సూచించారు. వాస్తవానికి సాధారణ ఎన్నికల్లో పోలింగ్ సమయం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉండగా ఈసారి మాత్రం ప్రస్తుత పార్లమెంటు ఎన్నికల్లో పోలింగ్ సమయాన్ని భారత ఎన్నికల సంఘం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పెంచిందని కలెక్టర్ తెలిపారు. పోలింగ్ సమయం పెంపు వల్ల ఉద్యోగులు, వ్యాపారస్తులు, కార్మికులు, అన్ని వర్గాల ప్రజలు ఓటింగ్ ప్రక్రియలో అధిక సంఖ్యలో పాల్గొని ఓటు హక్కును వినియోగించుకునేందుకు మరింత వెసులుబాటు లభించిందని అన్నారు. పెంచిన పోలింగ్ సమయాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుని, ప్రతి ఓటరు ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు.

## ఊట్పల్లి,అమ్దా పూర్ గ్రామలల్లో కాంగ్రెస్ నాయకుల ప్రచారం..

టైమ్స్ ఆఫ్ వార్త-బోధన్



బోధన్ మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు. గురువారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డీసీసీ డెలిగేట్ గంగా శంకర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగేశ్వర్ రావు, ఆమ్దాపూర్ సొసైటీ మాజీ చైర్మన్ పోరెడ్డి గంగాధర్ ల ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఊట్పల్లి గ్రామంలోని ఊర చెరువులో పనిచేస్తున్న ఉపాధి హామీ కూలీల దగ్గరకు వెళ్లి కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టో కరపత్రాలను అందించారు. ఈ సందర్భంగా డీసీసీ డెలిగేట్ గంగాశంకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 6 గ్యారెంటీ పథకాల్లో కొన్ని పథకాలు అమలు చేశామని మిగతా పథకాలను 15 ఆగస్టు లోపు అమలు చేయడం జరుగుతుందన్నారు. యూపీఏ చైర్ పర్సన్ సోనియా గాంధీ, అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ ల ఆధ్వర్యంలో జాతీయ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని కొనియాడారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికలలో హస్తం గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జీవన్ రెడ్డి ని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. ఊట్పల్లి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు టప్పా సాయిలు నాయకత్వంలో బీఆర్ఎస్ కు చెందిన దండు డ్రైవర్ సాయిలు, గుండ్ల నరేశ్ లు కారు దిగి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి డీసీసీ డెలిగేట్ గంగాశంకర్ కాంగ్రెస్ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఉపాధిహామీ కూలీలకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ డీసీసీ ప్రధాన కార్యదర్శి బొర్ర పల్లన్న, కారేగాం అశోక్ రెడ్డి, బల్లెపు నర్సయ్య, ఖాదర్ పాషా, నరేందర్ గౌడ్, జయరాజు, పెద్ద సాయన్న, ఇస్మాయిల్, జమీల్ తదితరులు పాల్గొన్నారు.

TIMES OF VARTHA (03-05-24)ff_times of varha main (13-2).qxd 5/3/2024 7:19 AM Page 7



టైమ్స్ ఆఫ్ వార్త
తెలుగు దినపత్రిక
శుక్రవారం, 03-05-2024



# ఫీజుల వసూలు మాత్రం ఏడాది..

## ప్రైవేట్ టీచర్లకు 12 నెలల జీతం ఇవ్వరా...?

### తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ ఫోరమ్ డిమాండ్

టైమ్స్ఆఫ్ వార్త-వరంగల్ జిల్లా:



ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఉన్న ప్రతీ ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యం విద్యార్థుల తల్లిదండ్రుల నుండి 12 నెలల (ఏడాది)కు మొత్తం ఫీజు వసూలు చేసినప్పుడు, అదే పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులకు ఎందుకు వేసవిలో వేతనం చెల్లించడం లేదని తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ ఫోరమ్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు చంద్రగిరి సునీల్ కుమార్ ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పాఠశాలలో వచ్చే జిపిఎ లు అంటే, అది టీచర్ల కృషి ఫలితం కాదా...?, మంచి ఫలితాలు వస్తె అది యాజమాన్య కృషి ఫలితం. కాస్త అటు ఇటు ఐతే టీచర్ల వైఫల్యమా..? అంటూ ఆగ్రహాన్ని వ్యక్తం చేసారు. గత కొన్నేళ్లుగా అదే పాఠశాలలో పని చేస్తే చులకన భావంతో చూస్తూ, అంకిత భావంతో పని చేస్తున్న టీచర్లను అవమానాలకు గురి చేస్తూ, సరైన గుర్తింపు, గౌరవ వేతనం పెంచకుండా, మానసికంగా, శారీరకంగా హింసిస్తూ, సరైన సమయంలో వేతనాలు ఇవ్వకుండా క్షోభ పెడుతున్నాయని అన్నారు. జీవో ఎమ్మెస్ 1 ప్రకారం పాఠశాలకు వచ్చే ఆదాయంలో సగం జీతాల రూపంలో ఇవ్వాలి. పిఎఫ్ ఉద్యోగస్తుడి జీతంలో కొంచెం, యాజమాన్యం కూడా అంతే మొత్తం పిఎఫ్ కార్యాలయంలో చెల్లించాలి. అంతే కాకుండా ఈపిఎఫ్, ఉపాధ్యాయుడు ఎలాంటి అనారోగ్యానికి గురైన కనీసం రూ.5లక్షల వరకు యాజమాన్యాలే భరించాలి.



ప్రభుత్వ ఉద్యోగులకు ఉన్న ప్రతీ సెలవులు ప్రైవేటు టీచర్ కు వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. వేసవి కాలంలో అడ్మిషన్ ల కోసం, ఇంటింటికీ, వాడ వాడకు తిప్పుతూ, టీచర్ కు ఉండే గౌరవాన్ని యాజమాన్యాలు దిగదార్చుతున్నారని వాపోయారు. ఇటీవల నల్గొండ జిల్లాలో ఒక మహిళా ఉపాధ్యాయురాలు (బోడఆశ్రిత) అడ్మిషన్ల కోసం వేసవిలో తిరిగి వడదెబ్బ తగిలి చనిపోయారు. అడ్మిషన్ లు తెస్తేనే మీకు ఉద్యోగం ఉంటుందని, లేక పోతే మీరు ఇంకెక్కడా పని చేయ కుండా చేస్తామని, యాజమాన్యాలు బ్లాక్ మెయిల్ కు పాల్పడ్డం చాలా బాధాకరమన్నారు. ప్రైవేటు టీచర్ అటు యాజమా న్యాలకు, ఇటు విద్యార్థి భవిషత్తుకు నిస్వార్థంగా కృషి చేస్తారు. కావునా ఇప్పటికైనా విద్యాశాఖాధికారులు, యాజమాన్యాలు మేల్కొని, టీచర్ల పట్ల సానుకూలంగా వ్యవహరించాలని, లేని యెడల, ప్రైవేటు టీచర్ కు ఏదైనా జరిగితే తెలంగాణ ప్రైవేట్ టీచర్ ఫోరమ్ తరపున చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ సమావేశంలో టిపిటిఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

## 20,000 నగదు, సెల్ ఫోన్స్, ఎత్తుకెళ్లిన దొంగలు..



టైమ్స్ ఆఫ్ వార్త - ఎడపల్లి



ఎడపల్లి మండలంలోని జాన్కంపేట్ గ్రామంలో రాచర్ల రాంబాబు అనే వ్యక్తి ఇంట్లో గుర్తుతెలియని దొంగలు ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు.బీరువా తాళం పగలగొట్టి ఇంట్లోకి ప్రవేశించి 20,000 నగదు, సెల్ ఫోన్, దోగిలించినట్లు బాధితుడు రాచర్ల రాంబాబు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. రాచర్ల రాంబాబు ఫిర్యాదు మేరకు చోరీ జరిగిన ఇంటిని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎడపల్లి పోలీసులు తెలిపారు.

## ఆర్థిక సాయం అందజేత

టైమ్స్ ఆఫ్ వార్త-బిక్కనూర్



మండలంలోని రామేశ్వర పల్లి గ్రామంలో మాజీ వార్డ్ మెంబర్ శ్యామర్తి బలరాంగారి భార్య బాలమని ఐదు రోజుల క్రితం మరణించడం జరిగింది. వారి కుటుంబానికి ఆర్థికసాయం గా 5000/- రూపాయలు రామేశ్వరం పల్లి గ్రామ ఎంపీటీసీ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు మద్ది చంద్రకాంత్ రెడ్డి ఇవ్వడం జరిగింది. ఇట్టి కార్యక్రమానికి జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి చేపూరి రాజు, చేపూరి అనిల్, పనా స, రాజు పైతరి మంజనేయులు, శా మర్తి, ప్రవీణ్,మల్లని ప్రసాద్, మైలారం సురేష్, మల్లన్న స్వామి, ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## పెండ్లి రోజు వృద్ధాశ్రమంలో అన్నదానం

టైమ్స్ ఆఫ్ వార్త - భిక్కనూర్ కామారెడ్డి



జిల్లాలోని భిక్కనూర్ మండలం కంచర్ల గ్రామానికి చెందిన మేజిషియన్ సంతోష్ భవాని దంపతుల పెళ్లిరోజును పురస్కరించుకొని గురువారం కామారెడ్డి మండలంలోని క్యాసంపల్లి లో గల వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మెజీషియన్ సంతోష్ మాట్లాడుతూ ఎవరు లేని వృద్ధులు, అనాధల మధ్య జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా వృద్ధాశ్రమంలో గల 35 మంది వృద్ధులకు అన్నదానం చేశానన్నారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



టైమ్స్ ఆఫ్ వార్త - భిక్కనూర్ కామారెడ్డి

భిక్కనూర్ మండలం జంగంపల్లి చెక్ పోస్ట్ వద్ద గురువారం దాదాపు ఏడు గంటల ప్రాంతంలో అర్కల వెంకట్, తండ్రి బాలయ్య, వయస్సు 39, కులం యాదవ, ఆర్ బి నగర్, కామారెడ్డికి చెందిన వ్యక్తి ఆర్టిఏ చెక్ పోస్ట్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. ఫిర్యాదు అందిన వెంటనే కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు భిక్కనూర్ ఎస్సై తెలిపారు.

## బీజేపీ, కాంగ్రెస్‌ల నుంచి బీఆర్ఎస్ పార్టీలో చేరికలు..

టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ సిటీ



నిజామాబాద్ జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన కాంగ్రెస్, బిజెపి పార్టీల నుంచి భారత రాష్ట్ర సమితి పార్టీలో చేరారు. ఇందులో భాగంగా మాక్లూర్ మండలం అమ్రాద్ తాండా గ్రామానికి చెందిన బిజెపి, కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్, జిల్లా పార్టీ అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే ఆశన్న జీవన్ రెడ్డి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారందరికీ నిజామాబాద్ పార్లమెంటు నియోజకవర్గం ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ చేతుల మీదుగా పార్టీ కండువా కప్పి బిఆర్ఎస్ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో నాయకులు కార్యకర్తలు అంతా క్షేత్రస్థాయిలో పనిచేసే బిఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. అదేవిధంగా తమ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన అభివృద్ధి పనులను ప్రజలకు తెలియజేయాలని సూచించారు.

## సొంత గూటికి చేరిన బుడగ జంగం కాలనీవాసులు

టైమ్స్ ఆఫ్ వార్త - బాన్సువాడ:



బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలోని మూడవ వార్డుకు చెందిన బుడగ జంగం వర్గానికి చెందిన యువకులు బుధవారం సాయంత్రం కాంగ్రెస్ కండువా కప్పుకోగా తిరిగి గురువారం ఉదయం మాజీ స్పీకర్ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి సమక్షంలో టిఆర్ఎస్ పార్టీలో చేరాగా, వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బాన్సువాడ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ జగ్గం గంగాధర్, కామారెడ్డి జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు డాక్టర్ దుద్దాల అంజిరెడ్డి, బాన్సువాడ సొసైటీ చైర్మన్ ఎర వాళకృష్ణారెడ్డి, నాయకులు ఎజాజ్, హకీమ్, తదితరులు, పాల్గొన్నారు.

## పీఎస్ఆర్ 2పిహెచ్చే కాలనీలో పరాసర్ నాయకుల పార్లమెంట్ ఎన్నికల ప్రచారం..



టైమ్స్ ఆఫ్ వార్త - బాన్సువాడ:

పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బాన్సువాడ పట్టణంలోని పీఎస్ఆర్ కాలనీలో బీ ఆర్ ఎస్ అభ్యర్థి గాలి అనిల్ కుమార్ ని భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేస్తూ గురువారం విస్తృత ప్రచారం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ బూత్ ఇంచార్జు కూని సుదర్శన్ గౌడ్, కృష్ణారెడ్డి, బాబన్, జమ్మూ, ఇమ్రాన్, లింగాల రవీందర్ రెడ్డి, హరీష్ కుమార్, తదితరులు, పాల్గొన్నారు.

## ట్రాఫిక్‌కు అంతరాయం



టైమ్స్ ఆఫ్ వార్త - చింతకాని

ఖమ్మం- బోనకల్ ప్రధాన రహదారిలో చింతకాని మండలం తిరుమలాపురం అడ్డరోడ్డు- నాగులవంచ మధ్య రహదారిపై విరిగి పడ్డ భారీ వృక్షంట్రాఫిక్ కు అంతరాయం

## బీజేపీకి ఓటేస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తరు

(మొదటి పేజీ తరువాయి)..



మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, అభ్యర్థి ఆత్రం సుగుణ, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు, నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాంనాయక్ పాల్గొన్నారు.

### బీజేపీ, బీఆర్ఎస్ రాత్రిపూట ఒక్కటే..

‘ఆగస్టు 15లోగా రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తా. సిద్దిపేట శనీశ్వరరావు హరీశ్‌రావు రాజీనామా చేస్తే సిద్దిపేట ప్రజలకు కూడా స్వాతంత్ర్యం వస్తుంది. అదే రోజు రైతులు రుణాల నుంచి విముక్తి పొందుతారు’ అని రేవంత్ రెడ్డి అన్నారు. మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు ప్రచారంలో భాగంగా సిద్దిపేట పట్టణంలో జరిగిన కార్నర్ మీటింగ్‌లో సీఎం ప్రసంగించారు. గతంలో ఇందిరా గాంధీని మెదక్ నుంచి గెలిపిస్తే ఆమె ప్రధానై.. వందలాది ఫ్యాక్టరీలను ఇచ్చి ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. ఢిల్లీ దొర మోడీ, దుబ్బాక దొర రఘునందన్‌రావు ఇక్కడి ప్రజలకు ఇచ్చింది గాడిద గుడ్డేనని విమర్శించారు. బీఆర్ఎస్, బీజేపీ పగటిపూట వేర్వేరు పార్టీలు అని.. రాత్రిపూట రెండూ ఒకటేనని ఆరోపించారు. సొంత భూములు గుంజుకొని, ఏటిగడ్డ కిష్టాపూర్ రైతులకు బేడీలు వేయించి, వందల ఎకరాలు ఆక్రమించుకున్న బీఆర్ఎస్ అభ్యర్థి వెంకటరామిరెడ్డిని డిపాజిట్ రాకుండా ఓడించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆనాడు కాశీం రజ్వీ ఎలాగో.. మామ అల్లుళ్లకు వెంకట్రామిరెడ్డి కూడా అలాంటి వాడేనని విమర్శించారు. మొదటిసారి గడీలను బద్దలు కొట్టే అవకాశం సిద్దిపేట ప్రజలకు వచ్చిందన్నారు. 45 ఏండ్లు మామా అల్లుళ్ళు సిద్దిపేటకు శనిలా దాపురించారన్నారు. కరీంనగర్ నుంచి వచ్చిన వెంకట్రామిరెడ్డికి ఇక్కడ అవకాశం ఎందుకు ఇచ్చారని, పోటీలో ఉండటానికి సిద్దిపేట ప్రాంతంలో ఒక్కరూ లేరా అని ప్రశ్నించారు. నీలం మధును లక్ష మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. మధు గెలిస్తే ముదిరాజులకు మంత్రి పదవి ఇస్తామని, బీసీ-డీ నుంచి ఏలో చేరుస్తామని హామీ ఇచ్చారు. అంతకుముందు మంత్రి కొండా సురేఖ, టీజేఎస్ అధ్యక్షులు కోదండరామ్, పూజల హరికృష్ణ, నీలం మధు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రోహిత్, నాయకులు నర్సారెడ్డి, నిర్మల జగ్గారెడ్డి, ఎలక్షన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సురేష్, అద్దంకి దయాకర్, మదన్ రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, హనుమంతరావు పాల్గొన్నారు.

## మోడీకి ఎందుకివ్వరు..?



(మొదటి పేజీ తరువాయి)..

మొహబ్బత్ కీ దుకాన్ (ద్వేషం నిండిన మార్కెట్లో ప్రేమ దుకాణం) అంటూ మాట్లాడుతుంటే, రాష్ట్రంలో కాంగ్రెస్ అక్రమ కేసులను బనాయిస్తున్నదని విమర్శించారు. ఎలక్షన్ కోడ్ అమల్లో ఉన్న సమయంలో ఫోర్జరీ, ప్రజలను తప్పుదోవ పట్టించడం అనేవి తీవ్రమైన నేరాలని కేటీఆర్ తెలిపారు. ప్రస్తుతం పోలీసులు ఎన్నికల సంఘం పరిధిలో ఉన్నారనీ, నిజంగా ఈసీ స్వయం ప్రతిపత్తి గల సంస్థే అయితే ఫోర్జరీపై చర్యలు తీసుకోవాలని కోరారు. కాంగ్రెస్, బీజేపీ రెండూ ఒక్కటేననీ, ఆ రెండు పార్టీలకు ఓటుతో బుద్ధి చెప్పాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు.

### కేసీఆర్ గొంతు నొక్కారు..

”మాజీ సీఎం కేసీఆర్‌కు ఈసీ ఆగమేఘాల మీద నోటీసులు జారీ చేసింది. నోటీసులు అందిన తర్వాత మా లాయర్లు, నాయకుల స్పందించి లీగల్ సెల్ ద్వారా జవాబు ఇచ్చారు. ఈ మద్యకాలంలో ఎండిన పంటల పరిశీలనకు కరీంనగర్‌లో పర్యటించిన సందర్భంగా సిరిసిల్లలో మీడియా సమావేశం నిర్వహించారు కేసీఆర్. ఎండిన పంటలు చూసి, రైతుల ఆర్తనాదాలు విన్న తర్వాత కాంగ్రెస్ పార్టీకి బుద్ధి లేదు.. ఇది కాలం తెచ్చిన కరువు కాదు.. కాంగ్రెస్ తెచ్చిన కరువు.. నీళ్లు ఉండి ఇవ్వలేని అసమర్థ ప్రభుత్వం అంటూ కొంత పరుషంగా మాట్లాడారు. బతుకమ్మ చీరలు ఆర్డర్లు ఇవ్వండి.. మా బతుకులను కాపాడండి, మళ్లీ ఆత్మహత్యలు మొదలయ్యాయని మొర పెట్టుకున్నారు. వారి ఆవేదన, బాధ చూసిన తర్వాత భావోద్వేగంతో కేసీఆర్ ఒక మాట అన్నారు. ఆ ఒక్క మాట మాట్లాడేసరికి కేసీఆర్ గొంతు నొక్కారు.

జనరల్ న్యూస్
GENERAL NEWS
టైమ్స్ ఆఫ్ వార్త
తెలుగు దినపత్రిక
శుక్రవారం,
03-05-2024


# పూజితను సన్మానించిన పాఠశాల యాజమాన్యం

టైమ్స్‌ఆఫ్ వార్త-వరంగల్ జిల్లా:



ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన పదవ తరగతి ఫలితాలలో వరంగల్ లోని యూ.హెచ్ స్కూల్ విద్యార్థిని పూజిత 10/10 జిపీఏ సాధించింది. గురువారం పాఠశాల యాజమాన్యం రంగశాయిపేట ఉరుసు ప్రాంతానికి చెందిన పూల పూజిత నివాసానికి వెళ్లి, శుభాకాంక్షలు, అభినందనలు తెలిపి, ఘనంగా సన్మానించారు. అలాగే 9,8 జిపీఏ సాధించిన లహరి, లుట్ ఫాన్ అంబరీన్ లను కూడా సన్మానించారు. అనంతరం పాఠశాల యాజమాన్యం బేగ్ మాట్లాడుతూ... విద్యార్థులు భవిష్యత్ లో ఎలా ఎదగాలి, మంచి మార్గంలో ఉన్నత విద్యను అభ్యసించి, తల్లిదండ్రులు గర్వపడేలా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ శమీబేగ్ రిజ్వాన్, అఖిల్ ఉల్లా బేగ్, కోలా రాము, మండల నరసింహరాములు పాల్గొని పూజితకు పూల బొకేలను అందించి, అభినందించారు. అనంతరం పూజిత తల్లిదండ్రులు మాట్లాడుతూ...మా పాపకు ఇంత పంచి ఫలితం రావడానికి సహకరించిన పాఠశాల యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపి, సంతోషాన్ని వ్యక్తం చేశారు.వ తరగతి ఫలితాలలో వరంగల్ లోని యూ.హెచ్ స్కూల్ విద్యార్థిని పూజిత 10/10 జిపీఏ సాధించింది. గురువారం పాఠశాల యాజమాన్యం రంగశాయిపేట ఉరుసు ప్రాంతానికి చెందిన పూల పూజిత నివాసానికి వెళ్లి, శుభాకాంక్షలు, అభినందనలు తెలిపి, ఘనంగా సన్మానించారు. అలాగే 9,8 జిపీఏ సాధించిన లహరి, లుట్ ఫాన్ అంబరీన్ లను కూడా సన్మానించారు. అనంతరం పాఠశాల యాజమాన్యం బేగ్ మాట్లాడుతూ... విద్యార్థులు భవిష్యత్ లో ఎలా ఎదగాలి, మంచి మార్గంలో ఉన్నత విద్యను అభ్యసించి, తల్లిదండ్రులు గర్వపడేలా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ శమీబేగ్ రిజ్వాన్, అఖిల్ ఉల్లా బేగ్, కోలా రాము, మండల నరసింహరాములు పాల్గొని పూజితకు పూల బొకేలను అందించి, అభినందించారు. అనంతరం పూజిత తల్లిదండ్రులు మాట్లాడుతూ...మా పాపకు ఇంత పంచి ఫలితం రావడానికి సహకరించిన పాఠశాల యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపి, సంతోషాన్ని వ్యక్తం చేశారు.

# బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం

## మాధవనేని మంజులాదేవి

టైమ్స్‌ఆఫ్ వార్త-పటాన్ చెరువు:



భారతీయ జనతా పార్టీ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి మాధవనేని రఘునందన్ రావుని గెలిపించాలని మంజులాదేవి ప్రజలను కోరారు. గురువారం పటాన్ చెరువు ప్రాంతంలోని గోనెమ్మ బస్తీ, నాయి కోటి బస్తీ, రామ్ మందిర్ ఏరియాలో బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి రఘునందన్ రావుకు మద్దతుగా ఆయన సతీమణి మాధవనేని మంజులదేవి గడపగడపకు తిరిగి, కరపత్రాలు పంచుతూ, రఘునందన్ రావుకు ఓటు వేయాలని స్థానిక ప్రజలను కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.... బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని, మోడీ పాలనలో భారతదేశం ప్రపంచ దేశాలతో పోటీపడుతూ ఎంతో కీర్తిని సాధించిందని తెలిపారు. మోడీ పాలన దేశానికి సుభిక్షం, సురక్షితమని తెలిపారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి బైండ్ల కుమార్, అసెంబ్లీ కో కన్వీనర్ శ్రీనివాస్ గుప్తా, పట్టణ అధ్యక్షులు నాగసాని నరేష్ కుమార్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు మాధురి, మాజీ ప్రధాన కార్యదర్శి కే.సుజాత, మహిళా మోర్చా పట్టణ అధ్యక్షురాలు రజిని, బాలరాజు, ఆర్.వి.ఎస్ రవి, రామ్మోహన్, ఆనందరెడ్డి, ప్రసాద్ యాదవ్, జగన్ రెడ్డి, జ్యోతి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటింటి ప్రచారాన్ని వేగవంతం చేయాలి

## ఎమ్మెల్యే జిఎంఆర్ అమీన్పూర్ ప్రజా ప్రతినిధులు

టైమ్స్‌ఆఫ్ వార్త- హైదారాబాద్ బ్యూరో:



అమీన్పూర్ బిఆర్ఎస్ పార్టీ మెదక్ పార్లమెంట్ సభ్యులు వెంకటరామిరెడ్డికి మద్దతుగా ఇంటింటి ప్రచారాన్ని వేగవంతం చేయాలని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి పార్టీ శ్రేణులకు సూచించారు. గురువారం అమీన్పూర్ మున్సిపల్ ఛైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన మున్సిపల్ పరిధిలోని ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులతో ఎమ్మెల్యే జిఎంఆర్ సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మున్సిపల్ పరిధిలో నిర్వహిస్తున్న పార్టీ ప్రచార శైలిని అడిగి తెలుసుకున్నారు. బూత్ స్థాయి సమావేశాల ద్వారా కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ.. ఉదయం సాయంత్రం ఇంటింటి ప్రచారం నిర్వహించాలని కోరారు. గత నాలుగేళ్లలో మున్సిపల్ పరిధిలో చేపట్టిన అభివృద్ధిని ఓటర్లకు వివరించడంతోపాటు, అధికార కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను వివరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, వైస్ ఛైర్మన్ నరసింహాగౌడ్, మున్సిపల్ అధ్యక్షులు బాల్ రెడ్డి, కౌన్సిలర్ కృష్ణ, మంజుల ప్రమోద్ రెడ్డి, కొల్లూరు చంద్రకళ గోపాల్, నవనీత జగదీష్, బాయిని బాలమణి బాలరాజ్, కో ఆప్షన్ సభ్యులు తల్లారి రాములు, యునుస్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు నల్ల రవీందర్ రెడ్డి, కాటా రాజు గౌడ్, కొల్లూరు యాదగిరి, దాస్ యాదవ్, సత్యనా రాయణ గౌడ్, నల్ల మాధవరెడ్డి, మహేందర్ రెడ్డి, ఆంజనేయులు, చౌటకూరి సురేందర్ రెడ్డి, చౌటకూరి మైపాల్ రెడ్డి, సత్యనారాయణ, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# స్క్రాప్ గోదాంలో భారీ అగ్ని ప్రమాదం



టైమ్స్‌ఆఫ్ వార్త-పటాన్ చెరువు:

సంగారెడ్డి జిల్లా పటాన్ చేరువు మండలం పోచారం గ్రామ శివారులో గురువారం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. పూజ ఎంటర్ ప్రైజేస్ స్క్రాప్ గోదాంలో అగ్నిప్రమాదం సంభవించి, భారీగా మంటలు ఎగిసిపడ్డాయి. స్థానికుల సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది వచ్చి, మంటల ను అదుపులోకి తీసుకున్నారు. ఈ ప్రమాద సంఘటనలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

# పట్టభద్రుల ఎంఎల్‌సికి నామినేషన్లు

టైమ్స్ ఆఫ్ వార్త - హైదరాబాద్ :

నల్గొండ -ఖమ్మం -వరంగల్ పట్టభద్రుల ఎంఎల్‌సి ఉప ఎన్నికకు నో టిఫికేషన్ విడుదలైంది. గురువారం నుంచే నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైంది. మొత్తం 12 జి ల్లాలతో కూడిన ఈ నియోజకవర్గంలో పోటీ చే యాలనుకునే అభ్యర్థులంతా నల్గొండ కలెక్టరేట్‌లోనే తమ నామినేషన్లను సమర్పించాల్సి ఉంది. నల్గొండ కలెక్టర్ హరిచందన ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తున్నారు. నామినేషన్‌ను దా ఖలు చేసే అభ్యర్థులు సెలవు దినాలు మినహా, మి గతా అన్ని ప్రభుత్వ పని దినాల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నా మినేషన్లు దాఖలు చేయవచ్చు. ఈ నెల 9 వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. ఈ నెల 10న నామినేషన్ల పరిశీలన, 13న నామినేషన్ల ఉప సంహరణకు అవకాశం ఉంది. ఈ నెల 27న పోలింగ్, జూన్ 5న ఓట్ల లెక్కింపు జరగనుంది. ఈ నియోజకవర్గం పరిధిలో 4,61,806 మంది పట్టభద్రులు ఓటర్లుగా నమోదయ్యారు. 2027 వరకు పదవీ కాలం : 2021 మార్చిలో పల్లా రాజేశ్వర్ రెడ్డి ఈ స్థానానికి ఎంఎల్‌సిగా ఎన్నికయ్యారు. 2027 మార్చి వరకు ఆయన పదవీ కాలం ఉండగా, ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన జనగామ శాసనసభ్యుడిగా ఎన్నికయ్యారు. దాంతో డిసెంబర్ 9న తన ఎంఎల్‌సి పదవికి రాజీనామా చేశారు. పల్లా రాజీనామా చేయడంతో ఈ స్థానానికి ఉప ఎన్నిక అనివార్యం కాగా, మే 27న పోలింగ్ నిర్వహించనున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుండగా, జూన్ 5న ఓట్లు లెక్కించి, అదే రోజు ఫలితాలు ప్రకటించనున్నారు.

# కవితకు మళ్లీ నిరాశే..



హైదరాబాద్ : ఢిల్లీ లిక్కర్ స్కాంకు సంబంధించి మనీ లాండరింగ్ కేసులో బిఆర్ఎస్ ఎంఎల్‌సి కవితకు మరోసారి నిరాశే ఎదురైంది. ఇడి, సిబిఐ కేసులో తనకు బెయిల్ మంజూరు చేయాలని ఆమె దాఖలు చేసిన పిటిషన్లపై గురువారం రౌస్ అవెన్యూ కోర్టు విచారణ చేపట్టింది. ఈ బెయిల్ పిటిషన్లపై ఈ నెల 6న తీర్పు వెలువరిస్తామని న్యాయమూర్తి జస్టిస్ కావేరి బవేజా తెలిపారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, కవిత బెయిల్ పిటిషన్లపై ఏప్రిల్ 22న కోర్టులో వాదనలు జరగ్గా, తీర్పును మే 2 గురువారంకు రిజర్వ్ చేసింది. గురువారం విచారణ సంద ర్భంగా మే 6వ తేదీకి తీర్పు రిజర్వ్ చేసింది. ఈ కేసులో కవితను మార్చి 15న ఇడి అరెస్ట్ చేయగా ఏప్రిల్ 11న సిబిఐ అరెస్ట్ చేసింది. ఈ క్రమంలో ఆమె 2 బెయిల్ పిటిషన్లు వేశారు. ప్రస్తుతం ఆమె 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీలో భాగంగా తీహార్ జైలులో ఉన్నారు. ఏప్రిల్ 22న విచారణ సందర్భంగా ఇరువర్గాలు తమ వాదనలు వినిపించాయి. 'మహిళగా కల్వకుంట్ల కవిత బెయిల్‌కు అర్హురాలు. ఆమె అరెస్ట్ నుంచి విచారణ వరకు ఎటువంటి సాక్ష్యం లేదు. కవిత అరెస్ట్‌కు సరైన ఆధారాలు లేవు. ఆధారాలు లేకుండానే కవితను అరెస్ట్ చేశారు' అంటూ కవిత తరఫు న్యాయ వాది సింఘ్వి వాదించారు. ఇడి కస్టడీలో ఉరగానే ఎందుకు సిబిఐ అధికారులు ఆమెను అరెస్ట్ చేశారని, అరెస్ట్ చేయాల్సిన అవసరం లేదన్నారు. తమ రాజకీయ పార్టీకి కవిత స్టార్ క్యాంపెయినర్ అని, ఇప్పుడు ఆమె ప్రతిపక్షంలో ఉన్నారని వాదించారు. ఆమె పార్టీ రూలింగ్‌లో ఉన్నప్పుడే కేసును ప్రభావితం చేయలేదని గుర్తు చేశారు. ఏడేళ్ల లోపల పడే శిక్ష ఉన్న కేసులో అరెస్ట్ అవసరం లేదని కోర్టు దృష్టికి తెచ్చారు. ఈ క్రమంలో సిబిఐ తన వాదనలు వినిపించింది. లిక్కర్ కేసును కవిత ప్రభావితం చేయగలరని వాదించారు. ఢిల్లీ లిక్కర్ కేసులో కవిత కీలకంగా ఉన్నారని బెయిల్ ఇస్తే సాక్ష్యులను ప్రభావితం చేస్తారని, సాక్ష్యాలను ధ్వంసం చేసే అవకాశం కూడా ఉందని కోర్టుకు వెల్లడించారు. ఈ కేసులో కవిత కింగ్ పిన్ అని, కవితకు బెయిల్ ఇవ్వొద్దన్నారు. ఈ వాదనలు విన్న ధర్మాసనం తీర్పు రిజర్వ్ చేసింది. తాజాగా, మే 6కు వాయిదా వేస్తూ నిర్ణయం తీసుకుంది.

# అంతు చిక్కని ప్రజానాడి ?

- త్రిశంకు స్వర్గంలో భువనగిరి పార్లమెంట్ ఎన్నికలు
- దగ్గర పడుతున్న పార్లమెంట్ ఎన్నికలు...
- చుక్క.. ముక్కా.. బుక్కా.. నోటు కోసం ఎదురుచూస్తున్న ఓటర్లు?
- అభ్యర్థులందరూ కోటీశ్వరులే కోట్లు కుమ్మరిస్తారన్న భరోసాలో క్యాడర్?
- కరువులో అరువు తెచ్చుకున్న కార్యకర్తలతో రోడ్ షోలు.. కార్నర్ మీటింగ్‌లు?
- గెలుపు భారం అధికార పార్టీ ఎమ్మెల్యేలదే అంటున్న అధికార పార్టీ అభ్యర్థి?
- తమ తమ సామాజిక వర్గాలే తమను గెలిపించుకుంటాయన్న భరోసాలో ప్రతిపక్ష అభ్యర్థులు
- మైనార్టీ ఓటర్ల పైనే కాంగ్రెస్, బీఆర్ఎస్ భవితవ్యం?






టైమ్స్‌ఆఫ్ వార్త - యాదాద్రి

పార్లమెంట్ ఎన్నికల బరిలో ఉండే అభ్యర్థుల నామినేషన్ పత్రాలు తుది రూపాన్ని దిద్దుకున్నాయి. ఎన్నికల కమిషన్ ఆయా అభ్యర్థులకు గుర్తులను కూడా కేటాయించింది. అభ్యర్థుల తమ గెలుపు కోసం గ్రామ గ్రామాన ప్రచారాన్ని హోరెత్తించాల్సింది. గ్రామ గ్రామాన భారీ ర్యాలీలు, సభలతో నేతల హోరాహోరీ ప్రసంగాలు, సుడిగాలి పర్యటనలు, గ్రామ గ్రామాన కటౌట్లు, హూర్డింగ్లతో, ప్రధాన రహదారులన్ని నిండిపోయేటివి. పట్టణ గ్రామీణ ప్రాంత ప్రజలు ఈ రాజకీయ పండుగల వేడుకలను చూసేందుకు ఉత్సాహం చూపేవారు. ప్రజలను ఉత్తేజపరిచే కార్యక్రమాల నిర్వహణలో ఏ రాజకీయ పార్టీ డబ్బు వృధా అన్న భావనలో ఉత్సవం చూపడం లేదని అభిప్రాయపడుతున్నారు. అంతేగాక ఆయా రాజకీయ పార్టీల నేతలు అంతగా ఉత్సాహం చూపక పోవడంతో గ్రామాలలో పట్టణాలలో ఎన్నికల ప్రజాస్వామ్య వేడుకల కళ కనిపించడం లేదు. ఇది ఇలా ఉండగా గత వారం రోజులుగా ఎండలు, వడ గల్పులు భయంకరంగా విస్తుంటాయని ప్రభుత్వం రెడ్ జోన్ ఆరెంజ్ జోన్లుగా అలర్ట్ ప్రకటించింది. అవసరముంటే బయటకు వెళ్లాలి, తప్పక జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తూ ప్రకటనలు జారీ చేస్తుంది. ఈ నేపథ్యంలో బరిలో ఉన్న అభ్యర్థులు అందరూ కోటీశ్వరులు కావడంతో రోజువారి ప్రచార కార్యక్రమాలలో అనంతరం వారిని ఈ వారం పది రోజులు మచ్చిక చేసుకునేందుకు ఓటర్లుకు చుక్కా.. ముక్కా.. బుక్క వంటి ఏర్పాట్లు చేయాల్సింది. కానీ గ్రామాల వారీగా ప్రచార బృందాలు, మైకులు మూగబోతున్నాయి. గ్రామస్థాయి, బూత్ స్థాయి, ముఖ్య నాయకులను పట్టించుకునే నాథుడు లేకపోవడంతో వారు నిరాశకు గురవుతున్నారన్న సమాచారం. ప్రతి నియోజకవర్గాలలో ఆయా పార్టీల అగ్ర నాయకులు సూర్యుడు అస్తమించిన అనంతరం ఎంచుకున్న ముఖ్య కూడాలీలలో తలించబడ్డ కార్యకర్తలతో రోడ్ షోలో, కార్నర్ మీటింగ్ లు నిర్వహించి ఉపన్యాసాలతో ఉదరగొడుతున్నారే తప్ప క్రియాశీల రాజకీయాలపై, ఓటర్ల సమీకరణలపై దృష్టి సారించకుండా పరిమిత ప్రచారాలకు పరిమితం చేస్తున్నారని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. గతంలో జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల అభ్యర్థులు రాజకీయ దురంధరులు, మేధావులు పోటీ చేసేవారు., పార్లమెంట్ నియోజకవర్గం, అసెంబ్లీ నియోజకవర్గాల ప్రజలలో ప్రాచుర్యం కలిగిన వ్యక్తులు బరిలో ఉండేవారు. రాను రాను పార్లమెంట్ స్థాయి నుండి గ్రామస్థాయి వరకు జరిగే ఎన్నికలు డబ్బు మయమయ్యాయి. వార్డు స్థాయి నుండి ఎంపీ, ఎమ్మెల్యే స్థాయి వరకు కోటీశ్వరులే బరిలో దిగటంతో ప్రతి ఎన్నిక డబ్బు మయం అయిందని ప్రతి ఒక్కరు అభిప్రాయపడుతున్నారు. ఏ ఎన్నికలైనా నియోజకవర్గస్థాయి నాయకులు, మండల స్థాయి, పోలింగ్ బూత్ స్థాయిలో అధికార, ప్రత్యక్ష నాయకుల వ్యూహాలను పసిగట్టుతు తమ తమ అభ్యర్థుల గెలుపు కోసం ప్రభావం చూపగలగే ముఖ్యనేతలు, వ్యూహ బృందాలు సమన్వయంగా జాబితాలను సిద్ధం చేసుకుంటూ ముందుకు సాగాల్సి ఉంటుంది. అందుకు అభ్యర్థులు కూడా వారికి ఆర్థిక సహాయం సమకూర్చాల్సింటుంది. అయితే ప్రధాన, ప్రతిపక్ష రాజకీయ పార్టీలు చెందిన అభ్యర్థులు కూడా గతంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల తరహాలోనే తమన్న కూడా గెలిపించుకుంటారని ఊహాలోకంలో పార్లమెంట్ బరిలో ఉన్న అభ్యర్థులు ఊహ లోకంలో తేలియాడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. కొన్ని కొన్నిచోట్ల అభ్యర్థికి సంబంధించిన బృందాలు, ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలకు సంబంధించిన బృందాల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తుందని రాజకీయ వర్గాలు బహిరంగంగా చర్చించుకుంటున్నాయి. గత నాలుగు నెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను పార్లమెంటు ఎన్నికల్లో తరహాలో ఫలితాలను రాబర్ట్ కోవాలని అధిష్టానం కోరుకుంటున్న విషయం తెలిసింది. అయితే అన్యోన్యంగా అధికార పక్షం అనుకున్న స్థాయిలో ప్రజల్లో వెళ్లలేకపోతున్నదాని మెజార్టీ ప్రజల్లో అభిప్రాయం కలగడం, బరిలో ఉన్న అధికార పార్టీ అభ్యర్థి లీడర్, కేడర్ ఆశించిన స్థాయిలో అనుసంధానం కాలేకపోవడం, నియోజకవర్గ స్థాయిలో మున్సిపల్, బూత్, మండల స్థాయి బూత్ కమిటీలు, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యుఐ కార్యకర్తలతో సమావేశాలకు పరిమితమవుతుందే తప్ప గ్రామస్థాయిలో ముమ్మరంగా ప్రచార కార్యక్రమం నిర్వహించలేకపోతుందని రాజకీయ విశ్లేషకులు విశ్లేషించుకుంటున్నారు. పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లోని అభ్యర్థి గెలుపునకు కీలకమైన ఓటర్లైన మైనార్టీ, ఎస్సీ, ఎస్టీ, ముదిరాజ్ నాయకులతో సమన్వయం చేసుకోవడంలో వ్యూహకర్తలు చొరవ తీసుకోక పోవడంతో వారి ఓటర్ల కరుణతో ఎవరికి లబ్ధి చేకూర్చనున్నదో వేచి చూడాల్సిందే. ఏది ఏమైనా భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికలు త్రిశంకు స్వర్గంలో తేలి ఆడుతున్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**PRINTED, PUBLISHED & OWNED BY** G.JANARDHAN REDDY, H.NO, 16-11-511/B/7,OPP : STREET KRISHINANDA MATAM, DILSUKHNAGAR, HYDERABAD-36. PRINTED AT y.v. reddy, binding works, h.no.5-20, shivani hotel line, gurga nagar, Hyderabad-36, Telangana.Editor G.JANARDHAN REDDY, RNI NO. **APTEL/2007/22828** CELL: 9948789066